TPLA131B117 2211
7244

ఎర్రభూతం

[కథలు]

'శార్వరి'

శ్రీ వేమన గ్రంథాలయము
తేదీ. 28-8-54
తేలప్రోలు కృష్ణా

ఆదర్శ గ్రంథమండలి
విజయవాడ-1.

తొలికూర్పు

వేయి ప్రతులు

1952

ముద్రణ

హైమవతీ ప్రెస్ లిమిటెడ్

విజయవాడ

వెల

రూపాయి

సంపాదకుడు :

గద్దె లింగయ్య

ఎర్రభూతం

ఇ ం దు లో

1 ఎర్రభూతం

2 శాంతి సోపానం

3 ఎర్రకొండ సాక్షిగా:

4 పునస్సమాగమం

5 యుగసంధ్య

6 ఆమె:

7 మా నిషాద

8 పరిష్కారం

9 ఆవ్యక్తత

TRLA101B497
1465
5 244
28.8.54

ఎర్రభూతం

తెల్లవారేసరికి "గుప్పు" మన్నది. జనం గుంపులు గుంపులుపడి ఆలోచించసాగారు. మా గ్రామ రక్షణదళ నాయకుడూ, మరి కొంతమంది దేశభక్తులూ కలిసి, ఈ విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించారు.

రాత్రి తెల్లవార్లూ ముఠాలుముఠాలుగా విభాగులమై వొళ్ళంతా కళ్లుచేసుకొని, చీమ చిటుక్కుమన్నా జాగ్రత్త తీసుకొంటూ, గ్రామా న్నంతా కాపాడుతూనే వున్నాం. ఎట్లా వొచ్చిందో తెలీదు. ఎప్పుడు వచ్చిందోగూడా తెలీదు. ఒక కుక్క - అందులో ఎర్రకుక్క మా వూ రొచ్చింది. అది మా వూరి కుక్కేమోననే అనుమానం మొదట కలిగింది. ఈ విషయం అవునో కాదో అని నిరూపించుకొనేదానికోసం, ఆ కుక్కను వెంటబెట్టుకొని, పదిమంది పోలీసులు తుపాకులతో సహా ఆ శ్వానరాజాన్ని పరివేష్టింప ఇంటింటికి తిరిగాము. మరేమీ లేదు. ఇటీవల కొంతమంది "దేశద్రోహులు"— "దుండగీండ్రు"—"బందిపోటుగాళ్ళు"— దేశా న్నంతా నాశనం చేస్తున్నారనీ. దోపిడీలు, గృహదహనాలు జరుపుతున్నారనీ, శాంతి- సౌభాగ్యాలతో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలిగిపోతున్న ప్రభుత్వాన్ని చీకాకుపరచటం జరుగుతున్నదనీ అందరికీ తెలిసిన విషయమే!

ఆ దుర్మార్గులు రాకుండా, గ్రామగ్రామానా "సముచిత చర్యలు" ప్రభుత్వంవారు తీసుకొన్నా రనేదిగూడా జగద్విదితం. రాత్రిగావటం భయం! ఒక్క పుకుగు మెదలడానికి వీల్లేదు. ఇంట్లోవాళ్ళు వీధిలోకి రావడానికి వీల్లేదు. ఒకటికీ, రెంటికీ పోవటానికి చాలా ఇబ్బందిగా వున్నదని కొంతమంది తెలివితక్కువ వెధవలు గోలపెట్టారు గాని, మేము వాటిని లెక్కచెయ్యలేదు. వారిమీద కోపంగూడా రాలేదు. దేశమంటే ఏమిటో వారికి తెలియనందువల్లనే అట్లా మాట్లాడారు. దేశంకోసం ఎవరెవరు ఎటువంటి మహాత్యాగాలు చేశారో వారికి ఓపిగ్గా బోధించాం. "ఇటువంటి దుండగీండ్రను అణచి, భూమండలాన్ని సురక్షితం చేసి కార్యక్రమంలో మీ రీ కొద్ది ఇబ్బందులు పడాలి" అని నచ్చచెప్పాం. వారికి మా బోధలు అర్థమైనయ్యో, లేదో గానీ మళ్ళీ కిక్కురు మనలేదు.

ఇంత కట్టుదిట్టంగానూ, పకడ్బందీగానూ వున్నప్పటికీ, ఎప్పుడు ఎట్లా, ఏవిధంగా వొచ్చిందో ఆ ఎర్రకుక్క వొచ్చింది. మా కంటబడింది. అది మా వూరు రావటానికి కారణాలేమిటో, ఏ ఏ వర్గాల ప్రోద్బలంతో, ఏ ఏ రాజకీయాశయాలతో ఆ కుక్క మా వూ రొచ్చిందో తెలుసుకోవలసిన మహత్తర బాధ్యత మా భుజస్కంధాలమీద వుంది.

మేము తెలివితక్కువవాళ్ళం గాదు. రెండు మూడు రోజులు అతి జాగ్రత్తగా దాని ప్రవర్తనను పరిశీలించాము. మాలో కొంతమందికి అది దేశద్రోహుల ఏజెంటేమోనన్నే అనుమానంగూడా కలిగింది.

ఈ సంక్షోభ నివారణనిమి త్తం వెంక టేశ్వర్లుగారి అధ్య క్షత క్రింద మే మొక రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేశాము. వెంక టేశ్వర్లుగారు లక్ష్యాధికారి. గింజలు, కిరసనాయిలూ, పట్టాలు దొరక్క ప్రజలు నానా గడ్డి కరిచే సమయంలో. వెంక టేశ్వర్లుగారు రహస్యంగా అవన్నీ ప్రజలకు సప్లయిచేసి– హెచ్చుధరే కాయొచ్చు–ప్రజలపట్ల తమ ఆదరాభిమానాలను రుజువుచేసుకొన్న ప్రజాస్వామిక వాది.

వెంక టేశ్వర్లుగారు మా సందేహాలన్నిటినీ పటాపంచలు చేశారు.

"సోదరులారా! భయపడకండి. ఈ కుక్క విషయం సాకల్యం గా నేను గ్రహించాను. రెండుమూడు గంటల క్రిందట వొచ్చిన తాజావార్తలనుబట్టి అది మరింత ధృవపడింది. మనకు వుత్తరదిశగా వున్న గ్రామం ఒకప్పుడు దేశద్రోహులకు పుట్టి నిల్లని మనందరికి తెలిసిన విషయమే. ప్రస్తుతం వా ళ్ళందరూ దేశమ్మీకాకులయిపోయినాము. అయినా ఆ లోఫరుగాళ్ళు మన శాంతిసామ్రాజ్యాన్ని ధ్వంసం చేయాలనే చూస్తున్నారు. కొంతమంది వేగులను పంపించి ఎప్పటికప్పుడు సంగతి సంద ర్భాలు తెలుసుకొంటున్నారు. అందులో ఒక భాగమే ఈ కుక్క మనవూరు రావటం! దాని ఆకారం, రంగూ మీరంతా చూశారు. 'ది ఎర్రగా వుంది. ఎడమపురంగు మన దేశద్రోహు లకు చిహ్నం. అందులో ఈ కుక్క ఆ వూరివేపు మొహంపెట్టి అరవటం మనం గమనించదగ్గ విషయం.

"ఇందులో ఎవరికీ సందేహాలుండవలసిన అవసరం లేదు. ఇది ఆ "కం..." గాళ్ళ పనే! కానిపక్షంలో ఈ కుక్క

ఆవ్యూహనుంచే రావటం ఎందుకు? పుకుగులు, కుక్కలు, పక్షులు మొదలయిన ప్రాణులద్వారా మన రహస్యాలను గ్రహిస్తున్నారు. వీటిని మనం తేలిక సమస్యలుగా శోధించటానికి వీలులేదు. అవి వచ్చి, మన రహస్యాలను తెలుసుకొని, ఆరు పులద్వారాను, కూతలద్వారాను తమవారికి తెలియజేస్తున్నాయి. పూర్వం రష్యాదేశంలోగూడా కమ్యూనిస్టులు ఇట్లాగే చేశారని చరిత్ర ఉద్ఘోషిస్తున్నది.

"రేపటినుండి మన మొక కొత్తపంథా అనలంబించాలి. మనవూళ్లో వున్న కుక్కలు, పందులు, పిల్లులు వగయిరా జంతువుల లెక్కలు తియ్యాలి. ప్రతిరోజు సాయంత్రం వొక కమిటీ ఆ యా జంతువులను తనిఖీ చేస్తుంటుంది. ఒక్కటి ఎక్కువవున్నాసరే విచారణ లేకుండా కాల్చిపారవేయవచ్చు. కొంతమంది అతి ముఖ్యమైన ప్రదేశాల్లో నియమింపబడి వుంటారు. ఆ వూరివేపు పోయే ప్రతి పక్షినీ, వొస్తున్న దాన్నీ కాల్చిపారేస్తారు. ఈవిధంగా మన స్థితి కొంత చక్కబడుతుంది."

వారి అపార మేధాసంపత్తికీ, విజ్ఞానానికీ ఆశ్చర్యపోయాము.

"రేపే ప్రభుత్వానికి ఈ విషయం తెలియచేద్దాము. మీ అభిప్రాయ మేమిటి?" అన్నారు వెంకటేశ్వర్లుగారు మా అందరివంకా చూసి.

తెల్లవారే ప్రభుత్వంవారికి కాగితాలు పోయినయ్. నాలుగురోజులకల్లా లారీలసిండా పోలీసులు దిగాము. ఈ

లోపుగా కుక్కను రచ్చబండదగ్గిర గొలుసులతో కట్టేశాం. దుడ్డుకర్రలతో కొంతమంది కాపలాలు కాశారు.

అది ఘోరంగా జరగటం సాగించింది.

"చూశారా! అది తనవాళ్ళకు వార్తలను అంద చేస్తోంది. బహుశా వాళ్లు దాడిచేయవొచ్చు" అన్నారు వెంక టేశ్వర్లుగారు. ఆ భయంవల్ల గ్రామంచుట్టూరా బరిసెల తోటీ,బల్లాలతోటీ జనాన్ని కాపలా పెట్టడం జరిగింది.

నాలుగు లారీలనిండా పోలీసు లొచ్చారు. వచ్చీ రావ డంతోనే తుపాకులు ఎక్కుపెట్టారు. జనాన్ని దూరంగా పొమ్మన్నారు. కుక్కకు దూరాన్నుంచే చుట్టుముట్టి ఒక్క సారి తుపాకులు కాల్చారు ఆ మోతకు మా చెవులు దిబ్బట పడ్డాయి. కుక్క చిన్నచిన్న ముక్కలుగా తెగిపోయింది. మా కృతజ్ఞతాసూచకంగా పోలీసులకు ఆ పూట కోడిపలావు తో "విందు" యివ్వబడింది.

౧

శాంతిపోపనం

ఉషాకాంతుల్ని తనలో విలీనం చేసుకున్న తూరుపు ఎర్రగా మండుతోంది. ఇంకా సూర్యోదయం అయ్యేందుకు అవకాశం వుంది. అది ప్రకృతిసహజం. ప్రపంచంలో భీభత్సరస ప్రధానంగా విలయతాండవం జరిగిపోనేగాని శాంతిరాదు అలజడి అణుగునే శాంతి కాపురం చేస్తుంటుంది. కాదనేందుకు ఎవరికీ దమ్ములేవు.

తూరుపుగా రాచబాటలో అలజడి ప్రారంభమయింది. అప్పుడే కళ్ళు తెరుస్తున్న అయోధ్య ఆశాకిరణాలు ప్రసరించినయ్ తూరుపుగా. కాని నిరాశ సమాధానపరిచింది. అంతఃపురంలోసౌమిత్రివచ్చిన వార్తలు అందినయ్. రామచంద్రుడింకా మగతనిద్రలోనే వున్నాడు. సౌమిత్రి రావటం రామచంద్రుని చెవుల్లో పడేట్లుగా చెప్పకుంటున్నారు పరిచారికలు.

సౌమిత్రి పేరు వినపడగానే రామచంద్రుడుదిగ్గునలేచాడు. వొళ్ళువిరుచుకుని, నిద్దరకళ్ళలో చూచాడు నలువైపులా ఎవరూ కనుపించలేదు.

"ఎవరూ?" అన్నాడు రామచంద్రుడు.

ఎవరూ పలకలేదు, రాలేదు. చాలా ఆశ్చర్యం. అయోధ్యమహారాజు శ్రీరామచంద్రుడు నిద్రలేచేసమయానికా ఎవరూ దగ్గర లేకపోవటం! కానీ, అంతా సౌమ్మిత్రిని గురించిన విచారంలో వున్నారు.

సౌమిత్రి శ్రీరామచంద్రుని పంపున సింహళంపై దండె త్తాడు. సింహళంలో విభీషణరాజ్యంగదా, రామచంద్రుడు ప్రారంభోత్సవంచేసి, విభీషణునికి సింహళాన్ని వప్పగించాడు గదా? అంటాము.

కావచ్చు. కానీ, రామచంద్రుడు సింహళంలో నియమించిన ప్రతినిధి విభీషణుడు. శత్రువు తమ్ముడు శత్రువైనాడు. అన్న రాజ్యాన్ని తమ్ముడికి దానంచేసి తన ప్రభావాన్ని, ధర్మస్తంభాన్ని నాటదలుచుకున్నాడు రామచంద్రుడు. కానీ, లంకావాసులకు రామునిచేష్టలు గిట్టలేదు. గిట్టే అవకాశంకూడా లేదు. ఎక్కడోఉన్న సింహళంమీద ఆయోధ్యావాసులు ఆధిపత్యం చలాయించటం ఏంన్యాయం? ఏ అంతర్జాతీయ న్యాయశాస్త్రం అంగీకరిస్తుంది గనక?

అందుకనే లంకావాసుల్ని రాక్షసులు అన్నారు వానరులు, సరులు. వీళ్ళదృష్టిలో– ఈ కోతిమూక దృష్టిలో రాక్షసులు సింహ్యాలు. అది ఎదురుగా ఆనేందుకు దమ్ములులేవు. రాక్షసులుగా, నిండ్యాలుగా చెప్పబడే లంకేయులు సర్వస్వతంత్రులు. మరొకరు తమమీద ఆధిపత్యం చలాయించటం వారి కిష్టంలేదు. విశ్వవిజ్ఞానం వారిలో మూర్తీభవించింది. వారిలో ప్రతివొక్కడు విశ్వవిజ్ఞాని. విశ్వసంస్కర్త. ప్రపంచాన్నంతా పరిపాలించగల సామర్థ్యం ప్రతివొక్కరిలోనూ వుంది. ప్రపంచంలో ఎవరికీ తెలియని మారణాస్త్రశాస్త్రం వారికి తెలుసు. అందుకనే వారంటే అసూయ ఈ వానరులకు, నరులకూను. వారిని జయించేందుకు అవకాశంలేదు.

విభీషణుడు స్వతంత్రించటంలో తప్పులేదు. సర్వాశ క్తిసంప న్నుడు ఒకరి చేతుల్లో ఉండవలసిన అవసరం ఏముందిగనక?

సౌమిత్రి అంతఃపురంలో ప్రవేశించాడు. ప్రజలు తండో పతండాలుగా సౌమిత్రి దర్శనకోసం తహతహలాడుతున్నారు. కాని అంగరక్షకులు ఎవరినీ లోనికి రానీయటంలేదు ప్రముఖ రాజకీయవేత్తలను మినహా. విభీషణునిమీద దండెత్తి కన్ను లొట్టబోయి, జడిసిపోయి ప్రాణాలతో బయటపడ్డాడు సౌమిత్రి. సౌమిత్రి తల పగిలింది ఒంటినిండా గాయాలు. బ్రతుకే దుర్భరం గావున్న పరిస్థితి. సౌమిత్రి స్థితిచూసి రామచంద్రుడు అంతా గ్రహించాడు. మిగిలిపోయిన సైన్యం పదిమందికిపైగా మాత్రమే పోయిన ఫలనాలుగు వేలకుగాను. వైద్యులు మంచి మంచి ఔషధాలనే వాడుతున్నారు.

సౌమిత్రి పరిస్థితులుచూచి విదేశాంగ మంత్రి ఆంజ నేయుడు ఆకాశమెత్తు దేహాన్ని పెంచాడు. శ్లోకపెండ్లాడు. ఒట్టి కోతివెధవ, కోతిచేష్టలు! అంతకన్నా చేయగలిగింది లేదు మరి బ్రతుకుకు.

శ్రీరామచంద్రుడు ఆలోచించాడు గత్యంతరం ఏమిటో అని. ఏమీ పాలుపోవటంలేదు. కానీ, మెరుపులాంటి ఆలోచన వొకటి తట్టింది. కళ్లు హసించినయ్. మొహం తేజోవంత మయింది. అగ్నేయాస్త్రం ప్రయోగిస్తే—

అవును. ఆగ్నేయాస్త్రం వెనుకటి యుద్ధంలోకూడా ప్రయోగించలేదు. నిజమే. చాలా ప్రమాదమయిందే. ఆ ఆయుధం అనన్యభేద్యమయింది. ఒక్క ఆయుధంతో రాక్షస మూకి నాశనం అవుతుంది. తమకు శత్రుపక్షం లేకుండాపోతుంది.

కాని వెంటనే మరోభయంకూడా పట్టుకుంది. ఆ ప్రయోగించే ఆగ్నేయాస్త్ర ప్రభావం అయోధ్యవరకూ వ్యాపిస్తే, అయోధ్య ప్రజలూ నాశనమైతే, తానూ నాశనమైతే మరి ప్రయోజనం!

ఏమైనాసరే విభీషణునితో సంప్రదింపులు జరపాలి. తన ఆగ్నేయాస్త్రాన్ని చూపించి బెదిరించి లొంగదీసుకోవాలి! నిజమే; ఆలోచన అయితే గొప్పదే. మరి అసలు విభీషణుడి దగ్గరకు పోయేదెవరు? పిల్లిమెళ్ళో గంట కట్టే ఎలుక ఎవరు? రామచంద్రుడు అంజనేయుడి వంక చూశాడు. అంజనేయుడి శరీరం కుంచించుకుంది. సౌమిత్రివంక చూచాడు. సౌమిత్రి ముసుగు పెట్టుకుని పక్కకు తిరిగి పడుకున్నాడు. తనవంక తనే చూచుకున్నాడు. శరీరం పులకరించింది. అయితే ధైర్యవంతులు అయోధ్యా నగరంలో ఒక్కరూ లేరా? వూరంతా చాటింపించాడు. నరులెవరూ కదల్లేదు. వానరులంతా తోకలు ముడుచుకున్నారు. జంతువులన్నీ మాయమయినయ్.

"విభీషణుడికి ఒక్క సందేశాన్ని అందజేయలేని చవట వెధవలు అయోధ్యావాసులని నే ననుకోవటంలేదు. రేపు యుద్ధం వస్తే ఏం చేస్తారు మీరంతా? చేతులు కట్టుకుని వొళ్ళప్పగిస్తారా?" అని గంభీరోపన్యాసం చేశాడు శ్రీరామచంద్రుడు. సౌమిత్రి ముసుగు మెడవరకు తీసి చూశాడు ఎవరైనా ముందు కొచ్చారేమోనని. ఆంజనేయుడు తోక ఆడించాడు.

ఓ ఎర్రచీలుక ముందుకొచ్చి మానవ భాషలో మాట్లాడింది "నేను" అని.

రామచంద్రుడికి ఆశ్చర్యం వేసింది ఈ "చిలుక" అని. కాని తప్పదు అంతకన్నా ధైర్యవంతులు ఎవరూ లేరు మరి.

రామచంద్రుని సందేశాన్ని చిలుక చేర్చింది విభీషణునికి. విభీషణుడు చిలుకను చాలా గొప్పగా ఆదరించాడు. కాని, సందేశాన్ని అందుకుని నవ్వాడు "సంధి!" అని.

విభీషణుడి సమాధానం ఏం లేదు: ఎర్రటి చిలుకను పచ్చగా మార్చి తిరిగి అయోధ్యకు పంపివేశాడు.

రామచంద్రుడు చిలుక రావటం గ్రహించాడు. కాని తానుపంపిన చిలుక కాదు. కాకపోయేందుకు వీలూ లేదు. మాన వభాషే మాట్లాడుతోంది. ఆశ్చర్యంలేదు. కాని రంగు మారటం ఆశ్చర్యం.

"ఇదేమిటి?" అన్నాడు రామచంద్రుడు.

"అంతే. ఇదే సమాధానం. వాళ్ళ విజ్ఞానానికి నిదర్శనం యిది. యిదేకాదు. యుద్ధంలో చచ్చినవారంతా తిరిగి బ్రతుకుతున్నా రక్కడ? సంజీవికన్న గొప్ప మందులు కనిపెట్టేసు వారు" అని ఒక్కసారి రెండురెక్కలూ విదల్చింది చిలుక. బంగారపు రంగులో "శాంతి" అని రెండురెక్కల మీదా వ్రాసివుంది. యిదే వారు పంపిన సమాధానం. ఏంచోద్యం! ఏం ఆశ్చర్యం!!

కాని రామచంద్రుని మనస్సు శాంతించటం లేదు. అసూయ, కసీని, వాళ్ళంత విజ్ఞానసంపన్నులయారే అనీ, తన చెప్పుచేతల్లోకి వారు రాలేదే అనీ. తనమోచేతి నీళ్ళు వాళ్ళకు రుచించలేదే అని ఎక్కడలేని కచ్చి.

ఎందుకు రుచించాలి విజ్ఞానికి?

శ్రీరామచంద్రుని నరాలు వేడిరక్తాన్ని కాగబెడు తున్నయ్. శరీరం వెచ్చగా ఆవిరికొడుతోంది. కళ్లు ఎర్రగా జ్యోతుల్లాగా మెరిసినయ్.మారణాస్త్రం,ఆగ్నేయాస్త్రం, తను. తన రాజ్యం, అయోధ్య కీర్తి, ప్రాణం, సంకుల సమరం!

దేవతలు ప్రసాదించిన పుష్పక విమానం కళ్ళకు కని పించింది. ఆగ్నేయాస్త్రం చేతిలో తళుక్కుమన్నట్లుగా వుంది. అదే ఈది సమరం. అంతకు మించిన విషయం లేదు.

ఈసారి యుద్ధభేరి మ్రోగించటం లేదు. సైన్యం అవ సరంలేదు. ఎవరికీ తెలియాల్సిన అవసరంకూడా లేదు. తనో క్కడే చాలు

ఎప్పుడు లేచి వెళ్ళింది తెలియదు ఎవరికీని. తెల్లవారే సరికి శ్రీరామచంద్రుడు మంచంమీద లేడు. పుష్పక విమా నం లేదు. అంబులపొదీ లేదు. సౌమిత్రి శరీరం చల్లబడ్డది పరి స్థితులు తలుచుకుంటే. ఆంజనేయుడితోక టకటకా కొట్టుకో నారంభించింది.

రామచంద్రుడు బిక్కమొగంతో జాముప్రొద్దెక్కి కాలి నడకన అయోధ్యకు చేరుకున్నాడు. సౌమిత్రి ఎదురుగాబోయి అన్నను కావిలించుకున్నాడు.

కాని, రామచంద్రుని మొఖంలో నెత్తురుచుక్క లేదు. చెప్పటం ప్రారంభించాడు– "ఆగ్నేయాస్త్రంమీద ఆశ పెట్టు కున్నాను. కాని ఆయుధానికి తుప్పుపట్టి ప్రయోగార్హం కాక పోయింది. శాంతి తప్పదు. విభీషణుడిని కలుసుకుంటాను. ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలి. నా మారణాస్త్రం ప్రయో గార్హంగాదు. ఈనాటికీ ఏనాటికీ కాదు, కాలేదు" అని.

సౌమిత్రి దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చాడు. ఆంజనేయుడు శోక నేలమీదవేసి గరాగరా దుద్దటం ప్రారంభించాడు దుఃఖాన్ని తట్టుకోలేక.

అదే సమయంలో విభీషణుడు పుష్పక విమానంలో రంగం మధ్యకి దిగి రామచంద్రుణ్ని కావలించుకున్నాడు.

రామచంద్రుని కళ్లు సంతోషంతో విప్పారినయ్. గొంతులోనుండి అస్పష్టంగా "శాంతి శాంతి" అనేమాటలు వెలువడ్డయ్.

విభీషణుని పెదాలు చిరునవ్వు నవ్వినయి శాంతంగా.

17

ఎర్రకొండపాక్షిగా

స్టేషనుకు రెండుమైళ్ళ దూరంగా ఉన్న ఫాక్టరీలు, మైకా గనులు ఆ దేశ సంపద. గనులకు ప్రక్కగా ఉన్న ఎత్తయిన ఎర్రటి కొండలు, కొండల ప్రక్కగా పారుతోన్న నది- అక్కడి ప్రకృతిసౌందర్యం వర్ణనాతీతం. ఎవరైనా గనులను గాని, గనులకు సంబంధించిన వ్యక్తులనుగాని చూడదలిస్తే స్టేషనునుండి రెండుమైళ్ళదూరం నడిచి రావలసిందే! జట్కాలు గానీ, రిక్షాలుగానీ అక్కడ ఉండేందుకు వీల్లేదు. స్టేషనునుండి మైకా ఫాక్టరీలనరకు చక్కని సిమెంటురోడ్డు, రోడ్డుప్రక్కన చెట్లు-వచ్చేవారి ప్రయాణానికి హాయిగానే ఉంటుంది.

ఆ ఫాక్టరీలను అందరూ 'గోకుల్ ఫాక్టరీ' లంటారు.అట్లా అనేందుకు బలమైన కారణాలు లేకపోలేదు. గోకుల్ ఒక సాధారణమైన కూలీ; కాని అసాధారణ వ్యక్తి.

గోకుల్ జీవిత చరిత్ర చెప్పుకోదగ్గ, ప్రశంసింపదగ్గ సంఘటనలతో నిండివుండేదిగాదు. కాని అతని ప్రవర్తన, అసాధారణ ప్రజ్ఞ, దానిని ప్రజ్ఞ అనేందుకు వీల్లేకపోవచ్చు- అతన్ని వ్యక్తిగా జేసినయి. మైకాగనులలో మైకా తీసేటప్పుడు అనేకమంది కూలీలు పడి చనిపోవటం పరిపాటి అయింది. కాని, అలా చనిపోయిన కూలీల సంసారాలు అడుక్కుంటూ దేశాంతరం వెళ్ళిపోవలసివచ్చేది. మిల్లుయజమానులుగానీ, మైకాగనుల

ప్రోప్రయిటరుగానీ వారికి ఏవిధమైన నష్టపరిహారం ఇచ్చే వారు గారు.

ఒక్కోజున గని తవ్వుతూ ఉన్నారు కూలీ లందరూ. పైనుండి పెద్దపెట్టున పెళ్ళ విరిగి కూలీలమీద పడ్డది. ఇర్వైనలుగురు కూలీలు చనిపోయారు ఒక్కక్షణంలో. అప్పుడే గోకుల్ మిల్లుయజమానులను, ఫాక్టరీ యజమానులను గద్దించాడు—ఆ చనిపోయినవారి కుటుంబరక్షణ చేయమని. కాని యజమాను లంగీకరించలేదు. వాళ్ళ హృదయాలు కరుణరస పూరితాలు గావు. కరుడుగట్టిన శిలాగూపాలు.

గోకుల్ హృదయంలో రగిలే చిచ్చును ఆర్పే సాధనం ఏమీ కనిపించటంలేదు. దావానలంగా మండిపోతోంది అతని లోని ఆవేదన. రాత్రి అయింది. ఉదయంనుండి ఇరవైనాలుగు కుటుంబాల రోదనధ్వని అతనిచెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. ఏంచేయ గలడు పాపం! ఒక్కడు. ఆలోచనలో నిమగ్నుడై వున్నాడు.

చీకటి పడింది. రాత్రి పదిగంటలు కావస్తూంది. తన గుడిసెలోనుండి బయటకు చూచాడు. ఇంకా రోదనతీవ్రత తగ్గలేదు. ఇల్లంతా కలయజూచాడు. దీపం గుడ్డిగా వెలుగుతోంది. చాపమీద ముసుగుపెట్టుకుని, చలికి వొణుకుతూ దుర్గి నిద్రపోతూనేవుంది.

బైటకు నడిచాడు ఒంటరిగా, చీకట్లో. రగిలే ఆవేదనలతో మిల్లు సమీపిస్తున్నాడు. మిల్లు దగ్గిర అవుతున్నకొలదీ అతనిలో ఉత్సాహం ఇనుమడిస్తోంది. కళ్ళలో రక్తపుజీరలు పొంగుతున్నాయి. ఫాక్టరీ గేటులో కాపలా ఘూర్ఖా నిద్ర పోతున్నాడు. కుక్కలు దూరంగా ఉన్నయి. ఆఫీసుతాళం పగల

గొట్టాడు. ఇనప్పెట్టి తాళంకూడా పగలిపోయింది అతని పట్టు దలకు త్వరత్వరగా చేతికందినన్ని నోట్లు, కరెన్సీనోట్లు- పుచ్చు కున్నాడు. అంతే. మళ్లీ తలుపులు వేయాలేదు, ఏంలేదు. వెళ్ళిపోయాడు.

గుడ్డిదీపం వెలుగులోనే ఇరవైనాలుగు కుటుంబాలకు పంచిపెట్టాడు. తలా ఒక వెయ్యిచొప్పున వచ్చింది.

ఆ మరునాడు గోకుల్ చేసిన పని తెలిసిపోయింది. కానీ, ఎక్కడా గోకుల్ జాడ లేదు. మేనేజర్లు వెదికారు, వెది కించారు. ఎక్కడా కనుపించలేదు.

అడవుల్లోకి పారిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని శవం ఎర్రకొండలపైన ఈనాటికీ అలాగే ఉందని వినికిడి. అందు వల్లనే, ఆనాటినుండీ ఆ ఫాక్టరీలకు గోకుల్ ఫాక్టరీ లను పేరు వచ్చింది. గోకుల్ చేసిన నేరానికిగాను అతని కూతురు దుర్గి కులట అయింది.

• • • •

గోకుల్‌కు పెళ్ళికాలేదు. కాని అతని కొక కూతు రుంది. ఆమె దుర్గి. ఎప్పుడూ అతని పోషణలోనే ఉండేది. కాని గోకుల్ చనిపోయినతర్వాత దుర్గిబ్రతుకు బండలపా లయింది. ఆ ఫాక్టరీలలో దానికి పని ఇవ్వలేదు మొదట. కాని, తరువాత కొద్దికూలిమాద పని దొరికింది. ఉదయంనుండి సాయంత్రం వరకూ ఫాక్టరీలలో కూలిపని చేయటం, రాత్రికి గుడిసె చేరు కోవటం. అదీ ఆమె జీవితచక్రం.

• ఒకరోజు సాయంత్రం సూర్యాస్తమయం అయింది. చీకటి పడుతోంది. అందరు కూలీల్లాగేపాటు దుర్గికూడ ఫాక్ట

రీలనుండి బయటకొచ్చింది. తలనిండా దుమ్ముపడి తెల్లగా ఉంది. ఒళ్లంతా దుమ్ము. మొఖం తుడుచుకుంటూ దోవ పట్టింది. కాని, అందరుకూలీలు పోతున్న దోవ వేరు – దుర్గి నడుస్తున్న దోవ వేరు. అదేమిటని ఎవరూ అడుగరు. ఆమె అంటే ఎవరికీ సానుభూతి లేదు. కారణం: ఆమె గోకుల్ భార్య కూతురు కాకపోవటమే. పాపం! ఆ తప్పు ఆమె కాపాదించటం ఏం భాగ్యం నిజానికి.

ఫాక్టరీలకు దూరంగా చిన్న తోటమధ్యన వుంది బడి. ఆ ప్రాంతాల కూలీలపిల్లలు, పట్టణంనుండి కొందరు పిల్లలు వస్తోంటారు ఆ బళ్ళో చదువుకునేందుకు. సాయంత్రం అయిదు గంటలకే బడి వదలిపెట్టారు.

కాని, కామరాజు పంతులుగారు అక్కడేకూర్చొని గుడ్డిదీపానికి ఎదురుగా పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. కామరాజు పంతులుగారు కుర్రవాడే. పాతికేళ్ళకన్న మించిన వయస్సు ఉండదు. మంచి సుందరరూపి, అందమయినవాడూ.

దుర్గివొచ్చి ఆయనకు ఎదురుగా నిలబడ్డది. పంతులు ఆ అమ్మాయినిచూచి నోరుపెగల్చలేక పోయాడు మొదట. అట్లాగే గుడ్లప్పచెప్పి చూస్తున్నాడు. అసలు ఆ అమ్మాయి ఎలా రాగలిగిందా అని అతని అనుమానం. ఆయనదృష్టిలో దుర్గికూడా ఒక ఎర్రకొండలాగా కనిపించింది.

"మీకోసం పనుండి వచ్చానండీ." దుర్గిగొంతులోని ఉత్సాహం మాటల్లో వెల్లడవుతోంది. "మీరు వొంటరిగా చీకటిపడ్డదాకా వున్నారే యివ్వాళ. గుడ్డిగా వెలుగుతోన్న దీపం జూచి మీరున్నారనే యిటొచ్చాను."

"ఏమిటి పని?"

'నాగ్గూడా చదువు చెప్పండి నేర్చుకుంటాను. ఫాక్టరీ పనులతో విసిగిపోయాను.'

'సరే, అయితే రేపట్నుండి రా!'

అన్నాడేగాని కామరాజు హృదయం ఎ[illegible] రాజు పం కోవటంలేదు. గోకుల్ చరిత్ర అంతా తెలుసు కామ[illegible] తన్ని తులుకు. కాని దుర్గిమాటల్లోని లాలిత్యము, రసము [illegible] కాదనిపించలేక పోయాయి. ఆమెతో పాటు బయటకు నడి చాడు. బడితలుపులు బిగించి చాలదూరం దుర్గితో మాట్లా డుతూ నడిచాడు.

'అయితే దుర్గీ! ఇక నువ్వు యింటికిపో. రేపటినుండి బడి కిరా' అన్నాడు చివరికి. దుర్గితో ఎంతసేపు మాట్లాడుతున్నా తనివితీరలేదు అతనికి. కాని తప్పనిసరై పొమ్మన్నాడు.

మర్నాడుదయం దుర్గి బడికొచ్చింది. చక్కగా తల దువ్వుకొని చాదుబొట్టు పెట్టుకుని ఉతికిన గుడ్డలు కట్టుకొని, చేతిలో పలక, పెదాలపై నవ్వుతో ప్రత్యక్షమయింది. ఆమెను చూచి బడిపిల్లలంతా గుసగుసలాట్టం ప్రారంభించారు. ఫాక్టరీ కూలీల పిల్లలకు దుర్గిరాక ఆట్టే బాధ కలిగించలేదుగానీ, బస్తీ పిల్లలలో గుసగుసలు ప్రారంభమైనాయి. ఈ విషయం వాళ్ళ పెద్దవాళ్ళకుగూడా తెలిసింది.

"దొంగముండాకొడుకు గోకుల్. వాడి కూతురు బడి కొస్తే దానిసావాసంపట్టి పిల్లలంతా చెడిపోరూ?" అని చాలా మంది తమ పిల్లల్ని బడి మాన్పించారు. కొందరు కామరాజును బెదిరించారు. కాని, కామరాజు వాళ్ళపిల్లల్ని మాన్పించేందు

కాని వొప్పుకున్నాడుగానీ, దుర్గిని వొద్దనేందుకు సిద్ధపడలేదు. క్రమంగా వాళ్ళ బెదరింపుల్లో చేవ చచ్చిపోయి, తిరిగి వాళ్ళ పిల్లల్ని బడికి పంపటం ప్రారంభించారు. అది తప్ప మరో బడి లేదు ఆ ప్రాంతాల్లో. అదీగాక కామరాజు చక్కగా చెప్ప గలడనే ప్రతీతి. ఎంతకాలమని బడికి పంపకుండా పిల్లల చదువు చేతులారా పాడుచేస్తారుగనుక.

కాలచక్రంలో మరో మూడు నెలలు తిరిగాయ్. వాతావరణం ప్రశాంతంగానే ఉంది. ఒకరోజు చీకటిపడ్డతరువాత కామరాజు బడిలో కూర్చుని చదువుకుంటున్నాడు. దుర్గి వొచ్చింది. "ఏం దుర్గీ యిప్పుడొచ్చావ్?" అని అడిగాడు పంతులు. కాని, దుర్గి చక్కగా అలంకరించుకుని ప్రయాణ సన్నాహంలో ఉంది. 'రాండి' అంది.

కామరాజు ఆమెతోపాటు బయల్దేరాడు.ఆమె రమ్మంటే కాదనలేకపొయ్యాడు. ఎక్కడికి పోవటమో తెలీదు. కాని కాళ్ళు నడుస్తోనే ఉన్నయ్. స్టేషన్ దాటి పట్టణంలోకివచ్చాకు. హోటళ్ళు, హాస్పెటళ్ళు అన్నీ వెనక్కు నడుస్తున్నాయి. దుర్గిని ఎరిగున్నవాళ్లు కొందరు దోవ తొలిగాకు. కొంద రసహ్యించుకున్నారు.

మరి ఒక మైలు నడిచాకు యిద్దరు. ఇద్దరిమధ్య మాటా పలుకుల్లేవు. పట్టణం దూరాన చీకట్లో గుడ్డిదీపాల పండగ్గా ఉంది. నదీ తీరాన అరమైలు నడిచాకు.ఆవలవొడ్డుకు పోవాలి. ఆ నిండు నదిలో ఒడ్డు పెళ్ళలు విరిగి పడుతున్నాయి. ఒక చిన్న పాయనుదాటి ఎర్రకొండ సమీపించారు. కొండ కొసకు చేరుకున్నారు. అదే సమయంలో యింకా చాలామంది ఉన్నా

రక్కడ. జనం గుంపుగా చూస్తున్నారు. గుంపును భోసుకుని దుర్గి లోపల దూరింది. కామరాజు దుర్గిని అనుసరించాడు. 'తడుగో నాన్న' అంది దుర్గి. దూరాన గోకుత్శవం, శవం ప్రక్కనే తుపాకి కనిపిస్తోంది. ఆ తుపాకిగోనే నాన్న కాల్చుకు చనిపోయింది.

♦ ♦ ♦

ఎండాకాలం. సాయంకాలం ఒకరోజు కామరాజు షికారుగా బయల్దేరాడు చాలాదూరం. ఒక పెద్ద తోట అడవిగా వుంది చూట్టానికి. అందులోంచి పోతూన్నప్పుడు దుర్గి కంఠం వినిపించింది. విని 'దుర్గీ!' అని పిలిచాడు. చెట్ల గుబుర్లలోంచి వొచ్చింది దుర్గి. "నువ్వుగూడా షికా కొచ్చావా?" అవునన్నట్లుగా తలూపిందిగాని అదే తన నివాసం అని చెప్ప సాహసించలేకపోయింది.

బడిలోకి కొత్తగా కమల అనే అమ్మాయి వచ్చింది. దాదాపు దుర్గి వయస్సే. ఆట్టే అందంగా వుండదు గానీ, చిలిపిగా వుంటుంది. అందర్నీ ఆకర్షిస్తుంది. కామరాజుపంతులు కమలతో చనువుగా వుండటం దుర్గి సహించలేకపోయింది. ఇంతకాలం తనతో అన్యోన్యంగా వుంటూన్న పంతులు ఇప్పుడీ కొత్తావిడతో స్నేహంగా మాట్లాడటం దుర్గికి ఈర్ష్యగానే వుంది.

ఒకరోజు ఉదయం దుర్గి బడికి రాలేదు. మధ్యాన్నం వచ్చేసరికి పంతుల్లేదు. "ఏడీ?" అంటే కమలతో కలిసి బయటకు వెళ్లాడని తెలిసింది. దుర్గి కళ్లలో కోపం మూర్తీభవించింది. ఏదో కాగితంమీద వ్రాసిపెట్టి వొచ్చేసింది. మళ్లీ

బడికి వెళ్ళలేదు. పంతులు వొచ్చి చూసుకునేసరికి దుర్గి వృత్తరం. ఆత్రంగా విప్పి చూచాడు.

"పంతులుగారికి—

ఇకనుండి బడికి రాను. అసలు మీకు కనుపించను. మీకు దూరంకావాలని వెళ్లిపోతున్నాను. నా వియోగానికి మీరేమీ చింతించకండి. కాని, కమలనుమాత్రం నమ్మకండి.

—"దుర్గి"

ఉత్తరం చదువుకునేసరికి కామరాజు గుండెల్లో పిడుగులు పడ్డయి. ఏదీ దుర్గి? ఎక్కడుంది? ఎక్కడికి పోతే దొరుకుతుంది? ఆమె ఇల్లెక్కడో తెలియదు తనకు. వెతుకుదామంటే ఎక్కడ? ఏంచేస్తాడు పాపం. ఎవరూ చెప్పరు ఆమెజాడ. అందరికీ కోపమే ఆమె అంటే.

దుర్గికోసం వెదకటం ప్రారంభించాడు వొంటరిగా, పిచ్చిగా. మళ్లీ అడవిలాంటి తోటలోకి పోయాడు. చెట్లలోంచి గలగల శబ్దం. దాహం వేస్తోంది. నీళ్లెక్కడ? ఎవరిస్తారు? చెట్టు మీదికి చూచాడు. దుర్గికళ్లు మెరుస్తోన్నయి. "దుర్గి" అన్నాడు.

దుర్గి పైనుండి మాట్లాడలేదు.

"రా దుర్గి రా, నాతో పలకవూ?"

"ఉహుఁ" అన్నట్లుగా మూతి ముడిచింది దుర్గి.

"దాహం వేస్తోంది, ప్రాణం పోతోంది. రా, రక్షించు."

"న న్నంటుకోకండా వుంటే వొస్తాను."

"సరేలే"

"కాదు, ఒట్టెయ్యి"

"నీతోడు, రా, దిగిరా!"

దుర్గి చెట్టు దిగివచ్చింది. అతని కళ్లలో నీళ్లు, ముఖం నిండా దుఃఖం. ఆమె హృదయం ద్రవించింది. "నీకోసం నేనే మాయం అవుతాను దుర్గీ." దుర్గి అతని చేతుల్లో వాలి పోయింది. అతని కన్నీటి బరువును ఆమె మొయ్యలేక పోయింది. అట్లా హృదయంలో హృదయం కరగిపోయినప్పుడు వేరే నోటిమాటల్తో ఒట్లు, ఒప్పందాలు దేనికి?

♦ ♦ ♦

నేల యావత్తూ పచ్చగడ్డిని కప్పుకొంది. చెట్లు చిగురిస్తున్నయి కొత్తగా. గోకుల్ సమాధి వున్న ఎర్రకొండకు జనం తిరణాలగా పోతున్నారు. దుర్గి జీవితం సంతోషంగా, సుఖంగా గడుపుతోంది. ఆ బడిలో చదివినవాళ్లలో దుర్గిలాటి తెలివి గలవాళ్లెవరూ లేరు. ఆమెకు ఆమెయే సాటి. అందువలన గూడా కామరాజుకు దుర్గి అంటే ప్రేమ. తన కష్టానికి దగ్గ ఫలం ఆమె.

దుర్గిని కామరాజు ప్రేమిస్తున్నాడా అంటే సమాధానం లేదు. అంటే అతను ప్రేమించేమాట వాస్తవమే. కాని, ప్రేమిస్తున్నానని చెప్పడు. దుర్గిని పెళ్లిచేసుకోవాలనే నిశ్చితాభిప్రాయంగూడా లే దాయనకు.

♦ ♦ ♦

నాటకసమాజంవాళ్లు నాటకాలను వేస్తున్నారు పట్టణంలో. దుర్గి ఒకరోజు అడిగింది కామరాజును "నాటకానికి పోదాం వస్తారా" అని. అందుకు కామరాజు సమాధానం చెప్పలేదుసరికదా, పైగా దుర్గినికూడా పోవద్దన్నాడు. ఆమెకు అతనిపై కోపం వచ్చింది. "నే పోతా" నంది. "నీకంటే కమలే మంచిది,

చెప్పినమాట వింటుంది" అన్నాడు. అట్లా అంటేనన్నా ఊరుకుంటుందేమోనని. ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయిందిదుర్గి. కామరాజుగూడా ఆ ప్రస్తావన ఎత్తుకోలేదు తిరిగి.

మర్నాడుదయం బడిపిల్లలు గుసగుసలాడుకుంటున్నారు.

"ఏమిట్రా అది?! అని అడిగాడు కామరాజు.

"మరండీ, దుర్గండీ, పోతోందండీ!"

'ఎక్కడికిరా, వెధవా!'

'అదేనండి, అక్కడికి'

'ఎక్కడికీ'

'నాటకానికండి సార్!'

'అంతేగదా!'

'కాదుసార్. వాళ్ళల్లో జేరిపోతోందండి. అస లీ వూరునుండే వాళ్ళతో లేచిపోతోందండి'

'నీకేం తెలుసు?'

'నాతో చెప్పింది సార్! తను నాటకాలు వేస్తాననీ, డాన్సులు చేస్తానని'

కామరాజు గుండెల్లో బండలుపడ్డాయి. తనదుర్గి తన క్కాకుండా నాటకాలవాళ్లతో లేచిపోవటమా? అతని బుద్ధి ఆలోచించ లేకపోతోంది. జీవితంలో దుర్గి తనను వదలిపెడుతుందని, వదలివేయగలదని అనుకొని ఎరగడు పాపం! తనంటే అమితమయిన ప్రేమతో ఉంటోందని అతని అభిప్రాయం. కాని తాను ఎల్లకాలం ముభావంగా ఉపేక్షించి ఊరుకుంటే దుర్గి గ తేంగాను! ఒక్కసారయినా ఆలోచించాడా? లేదే! ఆమె భవిష్యత్తును గురించి ఏకొంచె మయినా, కనీసం సానుభూతి

అయినా ప్రకటించాడా? లేదే! అయినప్పుడు అతన్ని నమ్మి కొని దుర్గి ఎందుకుండాలి?

పిచ్చిగా పరుగెత్తాడు పట్టణానికి స్టేషన్ దగ్గర్లోనే నాట కసమాజం డేరాలు. త్వరగా పోయాడు. కాపలావాడు ఎక్క డకని అడుగుతున్నా సమాధానంలేదు. "మేనేజరు ఎక్కడ? ఎక్కడ మేనేజరు?" అంటూ మేనేజరుగదిలోకి పోయాడు.

అడిగాడు మేనేజరును "మా బడిపిల్ల, పేరు దుర్గి, మీ నాటకాల్లో చేరుతానని వచ్చిందటగా?"

"అవును వచ్చింది" అన్నాడు మేనేజరు హేట్ తీసి టేబుల్ మీద పెడుతూ.

"మీరు వేరుగా భావించకపోతే నే నొక విషయం చెపు తాను. ఆమె ప్రస్తుతం నా పోషణలో ఉంటోంది. తల్లి, తండ్రి, అన్న, తమ్ములు ఎవరూ లేరు. ఆమెభాధ్యతలన్నీ మీరు చూడ గలరా?"

"నా కదంతా తెలీదు. ఆమెకు నాటకాలంటే మంచి ఉత్సాహంవుంది. పైకి రాగల అవకాశాలున్నాయి. ఆమెకు మీ రేమైనా కానీండి. నమ్మకంతో నా దగ్గర వదలండి. మిగతా విషయాలన్నీ నే చూసుకోగలను."

కామరాజు గొంతు తడబడింది ఆ మాటలు వినేసరికి. "ఓ!...ఆ అమ్మాయిని నువ్వు కాజేయాలని చూస్తున్నావన్లే వుంది. అదేం కుదరదు" అంటూ ఆ మేనేజరుతో కలబడ్డాడు. యిద్దరూ ఘోరంగా కొట్లాట ప్రారంభించారు. ప్రక్కనున్న వాళ్లు యిద్దర్నీ విడదీశారు. కామరాజును పట్టుకున్నతను తలు వుదాకా తీసుకొచ్చి బయటకు నెట్టాడు. "చంపేసేవాణ్ణి,

వాళ్ళంతా రాబట్టి బ్రతికి పొయ్యాడు" అంటూ బజార్న పడ్డాడు కామరాజు.

బడికి వచ్చేసరికి బడితలుపులు బార్లగా తీసివున్నాయి. క్లిటికీ గుండా దుర్గి నల్లని వంతులజుట్టు అగుపిస్తోంది. అతని ఆశ్చర్యం ఇంత అంత అని చెప్పడానికి వీల్లేదు.

కామరాజు మనస్తత్వం అంతా తేలిక్కైంది.దుర్గినిగురించి ఆలోచించటం ప్రారంభించాడు. అసలు దుర్గి ఎవరు? దుర్గికి తనకు ఏమిటి సంబంధం? ఎందుకు సంబంధం? ఆమెనుగురించి తనెందు కింత బాధపడవలసివచ్చింది?

ఈ ప్రశ్నలకు సమాధానంగా. చివరకు అతను కలుసు కోవలసిన దుర్గి కనుపించింది.గదిలోపల ప్రవేశించాడు. త్వరగా టేబుల్ దగ్గరకు పోయి "అమ్మాయి! లే. కొంచెం విశ్రాంతి గావాలి నాకు. ఒంటరిగా ఉండాలనుకుంటున్నాను" అన్నాడు చీకాకుగా.

దుర్గి లేచి నిలబడ్డది. కామరాజు కుర్చీలో కూర్చున్నాడు. మొఖం చేతులతో కప్పుకుని.

అరగంట ఆగి చూచినా దుర్గి అక్కడే నిలబడింది.

"ఏం అట్లా నుంచున్నావ్!" అన్నాడు కామరాజు

"అతడ్ని చంపారా?"

"ఉహూఁ!"

"చంపుతారనుకున్నాను"

"చంపుతారనుకున్నావ్! బలేమాట అనుకున్నావ్! చంపేవాళ్లే. వెధవలు అంతా అడ్డంవొచ్చారు."

"అది చెప్పేందుకే వచ్చాను. వాళ్ళతో వెళ్ళిపోదామనుకున్నాను. కానీ, డాక్టరు చెప్పాడు. అందుకనే ఆగిపోయాను. మిమ్మల్ని వొదిలిపోవటంకన్న చావటంమేలు.

"దుర్గీ చాలా అన్యాయంచేశావు.'

"అలాగే అంటోండండి. అలాగే నా హృదయంలో విషం పెడుతున్నారు. పోతున్నాను. వాళ్లలో చేరిపోతాను. అక్కడే చస్తాను విషం తిని" అంటూంటే ఆమె కళ్లల్లోంచి రెండు నీటిబిందువులు రాలాయి.

"దుర్గీ! నాతో వుండిపోతావా?"

ఆమె చేతులు ఆయన మెడచుట్టూ వేసి "ఉంటాను' అంది.

"ఇవాల్టినుండే'

"ఆఁ!"

ఇద్దరూ చెట్టపట్టాలు వేసుకుని బజార్న బయలుదేరారు. కామరాజు యిల్లు యిద్దర్నీ స్వీకరించింది. ఎర్రగొండ సాక్షిగా నవ్వుకున్నారిద్దరూ తెల్లని వెన్నెల్లో!!

30

పునస్సమాగమం

కృష్ణారావు వొచ్చాడని తెలియగానే శాంతమ్మ హృదయం భాధపడసాగింది. ఆమెకు ఒక్కసారిగా సంతోషం, ఏడుపూ వొచ్చినయ్. అట్లసంతోషం ఆ సమయంలో. అసలు ఈ మధ్య కృష్ణారావు విషయం పూర్తిగా మర్చిపోయిందనే చెప్పాలి. లేకపోయినట్లయితే శివరామయ్యను తిరిగి వివాహం చేసుకొనేది కాదేమో!

శాంతమ్మ కృష్ణారావు భార్య. అతణ్ని ప్రేమించింది. పెళ్ళిచేసుకుంది. కాని ఉద్యోగంలేని కృష్ణారావు చాలాకాలం బాధపడ్డాడు. కుటుంబభారాన్ని మోయలేక విసిగి వేసారి, చివరకి కట్టుకున్న శాంతను కూడా వొదిలి మిలిటరీలో చేరాడు. ఆనాడు అతను యుద్ధంలోకి పోవటానికి అంతకన్నా కారణాలేవీ లేవు. శాంతను ప్రేమించకనూకాదు, ఆమెపై విరక్తి వల్లనూకాదు. ఆమె అంటే ప్రాణాన్నయినా యిస్తాడు. కాని, అలాంటిశాంతను సౌందర్యమూర్తిగా, ఆరాధ్య దేవతలా ఎంతకాలం వుంచుకుంటాడు తిండిపెట్టలేక. అయినప్పుడు ఆమె సౌందర్యం ఎంతవరకు నిలుస్తుంది. ఎన్ని రోజులని తృప్తి పడుతుంది.

మిలిటరీలోకిపోయినా ఆమెను మరచిపోలేదు. ప్రతినెలా కొంతడబ్బు పంపుతూండేవాడు. ప్రతివారం ఉత్తరాలు వ్రాసేవాడు. శాంత మనస్సును ఆ విధంగా బంధించాడు కొంత

కాలం. కాని యుద్ధం విజృంభించాక కృష్ణారావు విషయం ఎవరికీ తెలిసేందిగాదు. అతని వద్దనుండి ప్రతి వారం వొస్తూన్న ఉత్తరాలు, ప్రతినెల వొస్తూన్న డబ్బుకూడా రావటంలేదు. అందుకు కారణాలేమిటో తెలియవు. కృష్ణారావుకు వ్రాసిన ఉత్తరాల్నుకూడా అతనికే అందకపోవడంతో అతను చనిపోయాడని తెలిసింది. మిలిటరీ అధికారులు కూడా అదే అనుమానాన్ని వెల్లడించేశారు.

శాంతమ్మపని నీళ్ళలో పడ్డ ఎలుకలా అయింది. ఇంత కాలం ఆశలు పెట్టుకునివున్న కృష్ణారావు చనిపోయాడు. తను బ్రతికెందుకు? ఏ అవకాశమూ లేదు. ప్రస్తుతం తల్లీ దండ్రీ లేని తను ఏంచేస్తుంది? కొడుకు డబ్బు పంపినంతకాలం వుంచుకున్న శాంత అత్త యిప్పుడు తనను పెళ్ళగొట్టింది. బజారు పాలైంది తను.

అసలు శాంత శివరామయ్యను పెళ్ళి చేసుకోవటం విచిత్రమైన సంఘటన. శివరామయ్య ఎన్నిసార్లు తనకు పెళ్ళి అవ్వమందామనుకోలేదు ముప్పయ్యేళ్ళ ఆయనకు ఎవరు పిల్లనిస్తారు గనక? అంతకాలం ఏవో సాకులుచెప్పి పెళ్ళి చేసుకోవటంనుంచి తప్పించుకున్నాడు. కొంతకాలం 'అప్పుడే నా కెందుకు వివాహ' మనీ, 'ఏం తొందరలే' అనీ. చివరకు ముప్పై యేళ్ళు వొచ్చాక పెళ్ళిమీద గాలిమళ్ళింది. కాని, యిచ్చే నాథుడికనిపించలేదు. అలా బాధతో, దిగులుతో రోజులు గడుపుతున్న శివరామయ్యకు శాంతమ్మ తటస్థపడ్డది.

తిండికి మాడి, అత్తకు వెగటై శాంతమ్మ దేశాంతరం బయల్దేరింది ఒక్కతే. యవ్వనంలో వున్న తను ఎవరిదగ్గరకెళ్ళి

వెళ్తుంది. ఏమని ఆశ్రయిస్తుంది. పుష్టిగా వయస్సులో వున్న తనను ఎంతమంది ఎన్నివిధాలుగా అనుకుంటారో! బాగా వున్న వ్వాడు తను ఎంతమందిని ఎన్నిమాటలన లేదుగనక? అలాగే తననూ అంటారు. అయినా తప్పదు. మనరోజులు బాగా లేన వ్వాడు తల వొంచుకొని ప్రయాణంచేయాలి? జీవితాన్ని ఎలాగో ఒక మార్గాన పోనివ్వాలి.

ఆరోజు నడిచినడిచి అలసిపోయి, రాత్రి ఎక్కడా తిండి దొరక్క నకనకలాడుతూ ఆ యింటి అరుగుమీదికి చేరింది. అప్పటికే రాత్రి తొమ్మిదిగంటలు కావొస్తూంది. బజార్న జనం నడవటంలేదు.కంట్రోలుదీపాలు గుడ్డిగా వెలుగుతున్నయ్. "అరుగుమీద రాత్రికి పడుకోనిస్తారా?" అని కేక వేసింది లోపలి వారికి వినిపించాలని. అలా బ్రతిమలాడడం, ఇతరుల మనస్సును రంజింపచేయటంకూడా చేతకాదు ఆమెకు. ఎప్పుడైనా అలవాటుంటేగా?

ఏదోపుస్తకం చదువుకుంటూ కూర్చున్న శివరామయ్య ఆశ్చర్యపడ్డాడు అంత రాత్రివేళ చీకట్లోంచి స్త్రీ కంఠం వినిపించినందుకు. తలుపు గడియతీసి తొంగిచూచాడు. చీకట్లో ఆమె అందం తెలియటంలేదు గానీ, ఆకారంమాత్రం పొడగట్టినది. అలాగే ఆశ్చర్యపడి చూస్తున్నాడు.

"రాత్రికి అరుగుమీద పడుకోనిస్తారా?" అంది శాంతమ్మ.

"ఏవ్వూరు మీది?" అన్నాడు తడబడుతూ.

".....

ఆమె చెప్పనందుకు అతను అర్థంచేసుకున్నాడు తన జ్ఞానంప్రకారం. "బయట చలి ఎక్కువగా వుంటుంది. లోపల పండుకోండి వచ్చి. ఫరవాలేదు"...అన్నాడు

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు. కాని అదే సమయంలో అనుమానం వేధించింది. కాని ఆయన్ను దీర్ఘంగాచూస్తూ అలాంటివాడు కాదని తెల్సుకుందికూడా.

"ఫరవాలేదు. యిక్కడే పడుకుంటాను" అంది. ఆమె గొంతు దీనంగా-స్వరం హీనంగా వుంది.

"లోపలకు రండి. మీకేం అభ్యంతరం లేదు. చాప యిస్తాను. హాయిగా నిద్రపడుతుంది. అదీగాక బయట దొంగల హడావుడి ఎక్కువగావుంది ఫూళ్లో" అన్నాడు.

తప్పిందిగాదు. లోపలకు పోయింది. మూడు గదుల యిల్లు. బాగావుంది. ఆడవాసన ఎక్కడా తగలటంలేదు. అన్నీ ధోవతులు, చొక్కాలు, యిలాంటివేగాని, చీరలు, రవికలు లేవు దగ్గాన.

"అలా వున్నారేం నీరసంగా" అన్నాడు శివరామయ్య పుస్తకంలోకి చూస్తూ. ఆమెవైపు గట్టిగా చూట్టానికి భయం అతనికి.

"ఆరోగ్యం సరిగా లేదండీ" అన్నది.

అతను చాలసేపు ఆలోచించాడు. ఆమెను చూచాడు. అంతలో అన్నంపెట్టేందుకు పనిమనిషి వొచ్చింది; పడే శ్నమ్మాయి. శాంతమ్మ చాల ఆశ్చర్యపోయింది.

"సీతామ్మ! ఆయమ్మగారికి స్నానంచేయించి అన్నంపెట్టు" అన్నాడు శివరామయ్య.

అతని కారుణ్యం ఆమెను పరవశురాల్ని చేసింది.ఎందుకు సమాధానం చెప్పలేకపోయింది. అన్నం వొద్దులెండి చందా వనుకుంది. కానీ, మాట పెగల్లేదు. ఆమె భోజనంచేసింది.

శివరామయ్య ఆమె విషయం పూర్తిగా తెలుసుకున్నాడు. "పాపం!..." అన్నాడు. ఆమెకళ్ళల్లో నీళ్లు తిరిగినయ్. అతని హృదయం బరువెక్కింది. ఆమెమీద జాలి, దయ, కరుణ క్రోడీకరించినయి అతని హృదయంలో.

"పోనీ, మీరు యిక్కడే ఎందుకు వుండిపోకూడదు?" అన్నాడు ఆమెకళ్ళల్లోకి లోతుగా చూస్తూ. అందు కామె అనుకున్నంతగా అభ్యంతరం చెప్పలేదు. ఆమె అలానే అనిపించింది. తనను శివరామయ్య వివాహం చేసుకోగూడదా అని. ఆయనకూ పెళ్ళి కాలేదు. యితర సంసారంగానీ, బంధువులు గానీ లేరు...మంచి సంపాదన.

శాంతమ్మ శివరామయ్యలు తూతూ మంత్రంగా పెళ్ళి చేసుకున్నారు. భగవంతుడి సాక్షిగా పురోహితునికి పదిరూపాయిలిస్తే సరిపోయింది. పెళ్ళి పూర్తయింది.వాళ్ల జీవితం సుఖంగా జరిగిపోతోంది. కృష్ణారావు ఆమెకి ఎప్పుడూ జ్ఞాపకం రాలేదు. రావలసిన అవసరం లేదేమో నిజానికి. స్త్రీ సుఖంగా బ్రతికినప్పుడు గత విషయాలు జ్ఞప్తికి రాకపోవటం సహజం.

శివరామయ అయినా అంతగా వయసు ముదిరినవాడు గాదు. ముప్పై సంవత్సరాలంటే పెద్ద ముదురు లెక్కలోది గాదు. వెనకటి వాళ్లు నలభై యేళ్ళు వొచ్చినా స్త్రీ స్పర్శ లభించేదికాదు. అదీకాక శివరామయ్య అప్పటివరకూ బ్రహ్మచారి. అన్యోన్యంగా సంసారం జరిగిపోతూంది. ఆమె

జీవితానికి ఒక దోవ చూపినందుకు శివరామయ్యను ఆమె ఎప్పుడూ అభినందిస్తూనే ఉంటుంది.

శివరామయ్యను గురించి చెప్పవలసిన విషయాలనేకం వున్నాయ్. అతను తెల్లని వస్త్రాన్ని పాలుగా, నల్లని వస్త్రాన్ని నీళ్ళుగా భావించే వ్యక్తి. శాంతమ్మమీద అభిమానమే గాదు, నమ్మకంగూడా ఎక్కువే. ఆమె అతని హృదయంలో జ్యోతి వెలిగించింది. అందుకనే అతను హృదయాన్ని ఆమెపరం చేశాడు. అందుకా శాంతమ్మ యోగ్యురాలు కాదని మాత్రం ఎవరనగలరు?

ఇప్పుడు తిరిగి క్రిష్ణారావు వొచ్చాడని తెలియగానే ఆమె హృదయం శోకించింది. పచ్చని తన సంసారంలో అగ్గి బెట్టేందుకు దాపురించిన శనేశ్వరుడుగా భావించింది. ఒక నాడు క్రిష్ణారావు తనను ప్రేమించినమాట నిజమే. కాని ఆమె జీవితం చుట్టు మళ్ళీ పొదలు నాటింది అతనే. ఆ పొద చీల్చి దారి చూపించింది శివరామయ్య. తిరిగి క్రిష్ణారావు వొచ్చాడు. ఎవర్ని ప్రేమిస్తుంది? ఎవర్ని కాదంటుంది?? విధి నిర్ణయం అనటానికి వీల్లేదు.

'మానవుడు చేయలేని పనులు విధిపైన వేయటం ఒక ఆచారమైంది. కాని శాంతమ్మకు అలాచేయటం యిష్టంలేదు. ఏదో పరిష్కారాన్ని ఆలోచిస్తో కిటికీలో కూర్చుంది. శివరామయ్య కోపంగా వొచ్చాడు. అతనికి కోపమేగాదు, దిగులు కూడాను. ఒకరి అదృష్టం మరొకరికి బందిఖానా కావచ్చు. కాదంటానికి వీల్లేదు. అదీ శివరామయ్య స్థితి ప్రస్తుతం.

"అతను వచ్చాడటగా" అడిగాడు శివరామయ్య.

"అవునన్నట్లు తలూపింది ఆమె.

ఆతరువాత అతని కళ్ళల్లోని క్రౌర్యం ఇల్లాంటిదని చెప్పటానికి వీల్లేనిదయింది.

'అతను చాలా మంచివాడు' అన్నది శాంత.

'అయితే?'

"నాకోసం వొచ్చాడు...నే నింకా బ్రతికే వున్నానని ఆశ పెట్టుకొని వొచ్చాడు—పాపం"

"కాని...ఏం వొస్తే" అన్నాడు శివరామయ్య.

"ఆమె ఆలోచిస్తోవుంది విచారంగా.

"అతనితోనే వెళ్లిపోతావా శాంతా?"అడిగాడుజాలిగా.

"అతను నన్ను యిదివరకు ప్రేమించాడు"

"నేనుమాత్రం యిప్పుడు ప్రేమించటంలేదు,'

"నాకోసం అతను ప్రాణాన్నే తృణీకరించి యుద్ధంలోకి వెళ్లిపోయాడు"

"అలా అదృష్టానికి వొదిలిపోవటం ప్రేమచొప్పనేనా?"

అతన్ని ఎలాంటి సమాధానం తృప్తి పరుస్తుందో ఆమెకు తెలియడంలేదు.

"శాంతా! వాడు నిన్ను ప్రేమించటానికి వీల్లేదు. వాడేకాదు, నువ్వూ వాడ్ని ప్రేమించటానికి, వాడితో వుండిపోటానికి వీల్లేదు. నే బ్రతికుండగా అలాంటిది జరగటానికి వీల్లేదు..."

"వారు...మీరు...ఎవర్ని కాదనేది? యిద్దరూ నా కోసం..."

"శాంతా! మా యిద్దరికి పోటీ యేమిటి? ఎవరో ఒకరు నీకోసం, నీ అందంకోసం, నీ ఆనందంకోసం...బ్రతకాలి."

శాంత ఆలోచిస్తోంది దీర్ఘంగా.

"ఎప్పుడొస్తాడు?" అన్నాడు శివరామయ్య.

"వొచ్చే టైమయింది... మీరు పొండి, కొంచెం మాట్లాడతాను."

"ఎక్కడికి పోను?"

"బజారు పోయిరండి."

"అతనితో లేచిపోవటానికా నే బజారు పోగానే?"

పోను -- పోయి మీ కన్యాయం చేస్తానా? చేయను. నా మాటమీద నమ్మకం వుంచాలి. నన్ను నమ్మండి. నేను మీతోనే వుంటాను. లేచిపోను. పోలేను. అతను నాకు భర్తగాదు.

'అతను నిన్ను ప్రేమిస్తున్నాడన్నావు. యిప్పుడంతా కపట నాటకంగా మాట్లాడుతున్నావు. నన్ను మోసంచేస్తున్నావ్'

"మోసం కాదండి, నామాట నమ్మండి. నాకు కల్మషం లేదు. ఆయన్ని నేను ప్రేమించటంలేదు. యిప్పుడు అన్నీ వొదులుకున్నాను. మిమ్మల్ని ప్రేమించాను...నాకోసం, నా సుఖంకోసం పాటుపడుతూన్న మీతో అబద్ధం చెప్పుతానా?"

"శాంతా! అతనితో ప్రేమగా మాట్లాడటం నే సహించలేను"

• "సరే..."

శివరామయ్యకు కోపం యింకా తగ్గలేదు. రహస్యంగా దాక్కున్నాడు కత్తి తీసుకొని తనభార్యను తీసుకుపోదలచు కున్న క్రిష్ణారావుమీద కసి తీర్చుకునేందుకు.

శాంత విచారానికి అంతులేదు. ఈ జీవన్మరణ సమస్య తేలకుండావుంది. ఏంచేస్తుంది.

"శాంతా...శాంతా!" ఎంతో సంతోషంతో క్రిష్ణా రావుకి తలుపుతీసింది. లోపలికి వచ్చాడు క్రిష్ణారావు.

"శాంతా, వొచ్చాను శాంతా...నీకోసం. అయ్యో సంతోషంగా లేవా? నే వచ్చానని విచారిస్తున్నావేం...

'ఆరోగ్యంగా వున్నారుగదు" అంది. కాని ఆమెలో విచారం ఏమాత్రం తగ్గటంలేదు. ఆమె హృదయం శోకిస్తోంది. కళ్లుమాత్రం నవ్వేందుకు ప్రయత్నిస్తున్నాయ్.

"శాంతా! ఇలారా" అని దగ్గరకు తీసుకోబోయాడు క్రిష్ణారావు.

"ఆగు!" అన్న కఠోరశబ్దం వినిపించింది. శాంత వెనక్కు తగ్గింది.

"ఎవరూ?" అన్నాడు క్రిష్ణారావు.

"వాళే" అన్నది శాంత.

పరిస్థితి అర్థమైంది క్రిష్ణారావుకి. ఒక్కసారిగా నిట్టూర్పు విడిచేడు.

"శాంతా నన్ను మరచి పోయావా?" అన్నాడు.

"అవును...తిరిగి యివ్వాళే జ్ఞాపకానికొచ్చింది" అంది.

అతనికి చాలా విచారం కలిగింది ఇంతకాలంలోను జ్ఞాపకం రానందుకు. అలాంటి తను ఆమెను...ఛీ! ఛీ! ఒక్క సారిగా నమిలేడు క్రిష్ణారావు.

"ఎందు కలా నవ్వుతావ్" అన్నాడు శివరామయ్య.

"ఈనాటికి నే నవ్వగలుగుతున్నాను."

"నీకు నవ్వుగా వుందా?"

"కాదు, వవ్వొస్తుంది."

"ఊ..." అన్నాడు శివరామయ్య.

"శాంతా..." అన్నాడు క్రిష్ణారావు.

"ఏమిటి?" అన్నాడు శివరామయ్య మధ్యలో.

క్రిష్ణారావుకు నవ్వొచ్చింది. శివరామయ్యకు అత డెందుకు నవ్వుతున్నాడో అర్థం కావటంలేదు.

శాంత హృదయం పిరికిపడుతోంది. తనస్థితి ఏమవు తుందోననికాదు గాని, క్రిష్ణారావుగతి ఏమిటా అని. తను పూర్తిగా తెగతెంపులుచేసి చెప్పేసింది 'నీమీాదనాకు మమ కారం లే' దని. పాపం! అతనిహృదయం ఎంతగా బాధపడు తోందో! ఎంతగా పరితపిస్తుందో. బలవంతాన తనను తీసుకు వెళ్ళడుగదా! శివరామయ్య.....అబ్బ!

క్రిష్ణారావు ఒక్కసారి నిట్టూర్చి అన్నాడు, శాంత మొఖంలోకి,శివరామయ్య ముఖంలోకి ప్రాశ్నికంగా చూస్తూ.

"శాంతా...నే వెళ్ళిపోతున్నాను. నీవు యింకా వెన కటి నా శాంతవనే అనుకున్నాను. కాని కాదు, నీలో ఎన్నడూ రాదనుకున్న మార్పు వచ్చింది. నీవు నాకొద్దు. నిజం.నామాట

నమ్ము. నీమీద నాకు కసీ, కోపం ఏవీ లేవు. మగోపరిస్థితిలో అయితే కోపం వచ్చేదేమోకానీ, యిప్పుడు రావటంలేదు. నిర్మలంగావున్న నీ జీవితసరస్సులో మట్టిపెళ్ళవేసి కలచడం నా పనిగాదు. నాకున్నజ్ఞానం అందుకు పుడికొల్పదు. నీ సుఖం కోసమే నేనింతకాలం యిన్నికష్టాలు పడ్డాను. కానీ యిక సుఖం అనుభవిస్తాను. యింతకాలం విశ్రాంతి లేకిపోయింది జీవితానికి...శాంతా! సుఖంగా జీవించు, అదే పదివేలు...వొస్తా... అంటూ వెళ్ళిపోయాడు.

అతని మాటలు ఎంతవరకు నమ్మాలో శివరామయ్య నిర్ధరించుకోలేదు. శాంతలో వొచ్చే మార్పులకోసం ఎదురుచూస్తున్నాడు. కిష్టారావు పోయిన శోకమే చూస్తూ, అతనుపూర్తిగా కనుచూపుమేర దాటగానే ముఖం చేతులూ కడుక్కుని వీధ్యా నారంభించింది.

'శాంతా... శాంతా... నేను' అంటూ శివరామయ్య కేకలు వేయడం మొదలెట్టాడు. అతని హృదయం నిర్మలమైంది.

యుగసంధ్య

మానవుడు ఎప్పుడూ కొన్ని కట్టుబాట్లకూ, నీతి నియమాలకూ లోబడి వుంటాడు. అవి దాదాపుగా వ్యక్తిపైన బలవంతంగా రుద్దినవే అయివుంటాయి. సాధారణంగా అంతా సంఘ నియమాలకూ, కట్టుబాట్లకూ లోబడే వుంటారు. అలా కాక ..

'నేను వ్యక్తిని ఎదిరిస్తాను. వ్యక్తుల సమూహమైన సంఘంతోగూడా నాకు సంబంధం ఏమాత్రం అవసరం లేదు' అంటారనుకోండి. సంఘం మిమ్మల్ని వెలేస్తుంది మొదట. తరవాత మీ ప్రశంసే ఎత్తదు. అప్పుడు మీరు కటిక పేదలైతే అణగదొక్కుతుంది కాక భాగ్యవంతులయితే ముభావంగా వూరుకుంటుంది. లేకపోతే గొప్పచేస్తుంది. డబ్బును చూసి గొప్పచేసినసంఘం మీరు ఏపనిచేసినా ఆమోదిస్తుంది. మీరు వ్యభిచరిస్తే సహిస్తుంది. మీ పిల్లలకి వర్ణాంతర వివాహాలు చేస్తే అంగీకరిస్తుంది. మరేం చేసినా నోరెత్తదు.

♦ ♦ ♦

సోఫాలో కూర్చుని తల్లీ కూతుళ్లు మాట్లాడుకుంటున్నారు. బ్లూలైటు వెలుగు గదినిండా చిమ్ముతోంది. కుర్చీలు, టేబుల్ ఇతర ఫర్నిచరు పాశ్చాత్యపద్ధతిలో అమర్చబడివుంది అందంగా. తలుపులోనుంచి బయటకు పారిపోవటానికి ప్రయ

త్నిస్తోంది నీలికాంతి. కాని ప్రక్కనే వున్న క్రోటనులు, దూరంగా వున్న మెట్లు పోనీయటంలేదు. లోపల ఒక పక్కగా మేడపైకి మెట్లు.

వాళ్ళ కంఠాలు అస్పష్టంగా వినిపిస్తోన్నై ప్రశాంత వాతా వరణాన్ని చీల్చుకుంటూ. ఆకాశంలో వెన్నెల వెలుగుల్ని కప్పు కున్న మేఘాలు కిటికీగుండా కనిపిస్తున్నాయ్. కొబ్బరిఆకుల్ని చీల్చుకుంటూ వెన్నెల లోపల ప్రవేశిస్తోంది.

రాజమ్మకు కూతుళ్ళంటే మహాయిష్టం. అందుకు కొడు కులు లేకపోవటంకూడా ఒక కారణం గావచ్చు. ఒకవేళ కొడుకు లున్నా కూతుళ్ళకు ఆపాటి ప్రత్యేకత యిచ్చేదేమో, మరి ఎవరు చెప్పగలరు? కూతుళ్ళంటే ప్రేమలేని తల్లులు ఎవ రుంటారు గనుక.

రాజమ్మకు పుత్రసంతానం లేనిమాట వాస్తవమే. ఐతే అదొక లోటుగా భావించలేదు ఆమె. ఆ యిద్దర్నే కూతు ళ్ళనుకున్నా, కొడుకులనుకున్నా. వాళ్ళే కొంచెంసేపు లాగులు వేసి, షర్టున తొడిగి మగపిల్లల్లా కనిపించేవారు. అంతలో ఆడ పిల్లలై లంగాల్లో. ఓణ్ణీల్లో అగుపిస్తుంటారు.

రాజమ్మకు పిల్లలంటే మహా మోజు. తన కాలం యావత్తూ వారిని ముస్తాబుచేయటంలోనో, సేవచేయటంలోనో వినియోగిస్తుంది. అదీగాక వేరే చేయవలసిన పనులుమాత్రం ఏమున్నాయిగనుక!

భర్త బ్రతికున్న రోజుల్లో – బాగా వయసులో వున్న ప్పుడు – అసలు రాజమ్మ చిన్ననాటి చరిత్ర తమాషాగా వుంటుంది.

రాజమ్మ అంతగా చదువుకున్న వ్యక్తిగాదు. అసలు మొదటినుండీ చదువుకోవాలనే కోరికే వుండేదిగాదు. పట్టి బలవంతాన పెద్దవాళ్లు బడికి పంపితే సీతాపతిగాడితో తిరుగుతుండేది. సీతాపతయినా పరాయివాడు కాడు గనక సరిపోయింది. అయినా అప్పుడప్పుడు తల్లి మందలించేది.

రాజమ్మ పెద్దదయినా సీతాపతితో తిరగటం మానింది గాదు. వెనకటిలా పొలాలవెంట, గట్లవెంట తిరక్కపోయినా, తోటలోమాత్రం తప్పక కలుసుకునేవాళ్లు. అసలు రాజమ్మను బడికి మానిపించటం యిబ్బందయింది వాళ్ళకు. కలుసుకోటానికి అదో వంక పెట్టుకుని అనుకున్న సమయానికి తోటలోకి చేరుకునేది నెమ్మదిగా, ఏదో పని వున్నట్టు. అతనూ అదే సమయానికి అక్కడికి చేరుకునేవాడు. ఒకటే గుసగుసలు, చెవులు కొరుక్కోటాలు. అట్లా రోజులు గడిచిపోతూ వున్నాయ్.

రాజమ్మకు పెళ్ళి చేయాలనుకున్నారు. అనేక సంబంధాలుకూడా వచ్చినయ్. డబ్బున్నవాళ్లు, పొలాలున్నవాళ్లు, మేడలున్నవాళ్లు అనేకమంది వచ్చారు సంబంధానికి. కాని, ససేమిరా నే చేసుకోనని మొండికెత్తింది రాజమ్మ. గత్యంతరం లేక చాలాకాలందాకా పెళ్లిప్రయత్నాలు ఆపారు తలిదండ్రులు. కాని రోజులు గడుస్తున్నకొద్దీ, ఏళ్ళు పైబడుతున్నయ్‌గాని తరగటంలేదు. అందులో నలుగురూ ఏమన్నా అనుకుంటారేమోననే భయం ఒకవైపు, వుండివుండీ రాజమ్మ కొంపముంచుతుందేమోనన్న భయం ఒకవైపు– ఇన్ని భయాల మధ్య ఆమ యిష్టం లేకండా ఒక సంబంధం స్థిరపర్చారు.

లగ్నంలోజు – విడిదివారు వచ్చి దిగారు. మంగళస్నానాలకు ఏర్పాట్లు జరుగుతున్నయ్ ఒకప్రక్క—ఒకప్రక్క పెళ్లికూతురు కనిపించడంలేదంటే కనిపించడంలేదని వెతికాకు ఇంటిల్లిపాదీ మాయమైందంటే మాయమైందన్నాకు. విచిత్రం – ఆరాతీయటం ఎవరికీ చేతకాలేదు. ఈ వార విడిదియింటి దగ్గర వూదా రెవరో. అంతా గల్లంతుగా వెతకటం ప్రారంభించారు. బావులు, చెరువులు. గోపులూ. పొలాలు ఎక్కడా కనిపించలేదు. పెండ్లికొచ్చిన పెద్దలు నానా మాటలూ అని వెళ్లిపోయారు.

రాజమ్మ తలిదండ్రుల దుఃఖానికి అంతులేదు. భోరు భోరున యేడవడం సాగించారు. అసలు ఆ పెండ్లి రాజమ్మకి యిష్టంలేదనీ, తామే బలవంతంగా తలపెట్టామనీ, ఈ ముదనష్టపు పెళ్లి మొదట అనుకోకపోయినా కూతురు దక్కేదే ననీ, నిక్షేపంగా సీతాపతికిచ్చివేస్తే ...అనుకున్నారు.

సీతాపతి విషయం జ్ఞాపకం వచ్చేటప్పటికి రాజమ్మ దొరికినంత సంతోషం కలిగింది. తీరా ఆరాతీస్తే అతను వూళ్లో కనిపించలేదు. పైగా యింట్లో పోట్లాడి రెండువేల రూపాయలు తీసుకుని చెప్పకండా పారిపోయాడనికూడా తెలిసింది. ఇంకేం యిద్దరూ కూడబలుక్కునే యింతపనీ చేసివుంటారని పెద్దలు తీర్మానం చేసుకొన్నారు.

రాజమ్మ తెలివైందిగనక ఆ పట్టున పట్నం చేరుకుంది సీతాపతికోసమూ. ఓ పెద్దమేడ అద్దెకు తీసుకుని కాపురం పెట్టించింది. ఓ గొప్ప ప్లీడరు సలహాప్రకారం సీతాపతి తండ్రిమీద దావావేశాడు భాగంకోసం. మూడో నెలకల్లా భాగం

దొరికింది. ఈసారుగా సీతాపతిగారి దూరపు వారను లెవరో చచ్చి మరో ఇరవైవేల ఆస్తి చూపించింది. వీటన్నిటితో సీతాపతి, రాజమ్మల అదృష్టం ఫక్కుమని నవ్వింది.

సీతాపతి చనిపోయేనాటికి రాజమ్మకు యిద్దరు పిల్లలు. కూతుళ్ళంటే గారాబం గనక, చాలాకాలం వరకూ బడికి పంపకుండా ప్రైవేటుగా చదువు చెప్పిస్తూవచ్చింది. కాని హైస్కూలుచదువులు, పెద్దచదువులాయె మరి, బడికి పంపక తప్పిందిగాదు.

పెద్దకూతురు సరోజిని కాలేజీలోచదువుకోందియిప్పుడు. రెండోకూతురు యింకా చిన్నదే. పదేళ్లుంటాయి. రాజమ్మ తన పూర్వ చరిత్రను కథలాగా చెపుతూంటుంది కూతుళ్ళకు. ఎప్పటికప్పుడు ఆ కథ రుచిగా, హాయిగా వుండేది వింటానికి. ఆది చెప్పటంలో నేర్పు, కథలోని బిగువు వాళ్ళను బాగా ఆకర్షించేది.

ఇప్పటికీ రాజమ్మ ఆ యింట్లోనే వుంటూవుంది కూతుళ్ళతో సహా. భర్త బ్రతికున్న రోజుల్లోనే మంచి పలుకుబడి సంపాదించుకుంది గనక, ఆయనగారు పోయినా నిలబడగలిగింది పదిమందిలో గౌరవంగా. నిజంగా చూస్తే ఎవరితోటీ సంబంధము వుండనవసరం లేదు ఆమెకు. చేతినిండా సొమ్ము. లోటేమీ వుండేదిగాదు యితరుల సహాయం, సలహా లేకపోయినప్పటికీ. కాని రాజమ్మ వూరుకుంటేగా! భర్తకాలంనుంచీ వస్తున్న స్నేహితులను- అటు భర్తకు సంబంధించిన వారినీ, ఇటు తనకు సంబంధించిన వారినీ పోకుండా పట్టుకువస్తోంది.

స్నేహితులు అధికంగా వస్తూ పోతూ వుండే సంసారం. పైగా ఆమెకూతుళ్ళు చదివేది యింగ్లీషు. స్నేహితుల కేం తక్కువ. పిలిస్తే పలుకుతాము. అటు ఆడపిల్లలూ, యిటు మగ పిల్లలూ స్నేహితులు సరోజానికి.

రాజమ్మగారు కూతురుతో మాట్లాడుతున్న విషయం కొంత రహస్యం. అసలు ఆమె సంసారానికి దాచుకోదగ్గ రహస్యాలంటూ ఏమీ లేవు. చూచేవారికి మాత్రం రహస్యంగా కనిపిస్తుంది. కాని అవి కుటుంబానికి సంబంధించిన కొన్ని మామూలు సమస్యలు. వాటినే రహస్యాలుగా వాడుకుంటారు చాలామంది సామాన్యంగా.

రాజమ్మ సంఘాన్ని గురించీ, నీతిని గురించీ బాగా తెలుసుకున్న వ్యక్తి. సంఘంలో నీతిపేర జరుగుతున్న మోసం, అవినీతి, కుళ్ళు అంటే ఆమెకు తగని చీదర. ఆమె పూర్తి సంస్కార వాది మాత్రం కాకపోయినా, బూజుపట్టిన, సనాతన ఆచారాలంటే అసహ్యం. అన్నిటికన్నా ముఖ్యంగా డబ్బుకున్న విలువ బాగా తెలుసుకుంది. దాంతో చేయలేని పనంటూ లేదు ఆమెకు. అందుకనే కూతుళ్ళనూ తనలాగానే పెంచుతోంది. వాళ్ళు కోరినవాటికి అభ్యంతరం చెప్పదు. తన కిష్టమైనంత మాత్రాన వాళ్ళను అనుసరించ మని బలవంత పెట్టదు.

కూతురు పెండ్లివిషయమై ప్రస్తావన. రాజమ్మ అడిగిన విషయాలకు సరోజిని సరిగ్గా సమాధానం యివ్వలేదు. పైపెచ్చు రాజుతో స్నేహం కొంతవరకూ తగ్గించుకోమని

రాజమ్మ సలహా యిచ్చింది. అందుకు సరోజినికి కోపంవచ్చింది

♦ ♦ ♦

వస్తున్న సవ్వడినిబట్టి రాజేనని యిద్దరూ గ్రహించారు. రాజమ్మ ఆ ప్రస్తావన ఆపింది. లోపల్లోపల ఆలోచించుకుంటోంది. ఇలాంటి స్నేహితులే చివరికి మోసంచేసేదని ఆమె వూహ. సరోజిని రాజుతోకలిసి మేడపైకి వెళ్ళిపోయింది.

రాజుది మొదట ఓ పల్లెటూరు. అతను తలిదండ్రుల్ని కూడా ఎరగడు పాపం. రాజు రెండేళ్ళ కుర్రాడుగా వున్నప్పుడే తల్లి చనిపోయింది. భార్యపోయిన దిగులుతో అతని తండ్రికి పిచ్చెత్తిందనీ, ఆ తరవాత సన్యాసుల్లో కలిసిపోయాడనీ, అదిజరిగి యిప్పటికి పదిహేడు పద్దెనిమిదేళ్లు ఆవుతుందని అంటారు. పోతే రాజును పెంచింది దగ్గిర బంధువుగా వున్న ఒక ముసలావిడ. ప్రస్తుతం రాజు పట్నంలో చదువుకొంటున్నాడు. తండ్రికి సంబంధించిన ఆస్తి తాలూకు డబ్బును తెచ్చుకుని కాలం గడుపుతుంటాడు. అతన్ని పెంచిన ముసలమ్మ అతను పుట్టిన వూళ్ళోనే యింటిని కనిపెట్టుకుని వుంటోంది యిప్పటికీ.

రాజుది మంచి విగ్రహం. క్లాసు మొత్తంలోకే తెలివి గలవాడని ప్రసిద్ధి. చక్కగా నాటకాల్లో వేషం వేయగలడు కూడాను. ఏ కోశానా దురభ్యాసాలు, చెడుతిరుగుళ్లు ఎరగడు కనకనే సరోజిని అతని స్నేహాన్ని వాంఛించింది. రాజు భోజనం హోటల్లోనన్నమాటేగాని వుండటం రాజమ్మగారింట్లోనే. అదీ కాక సరోజినికి తోటవిద్యార్థి.

సరోజినికి అప్పుడప్పుడు అతనిమీద మమకారం పుట్టుకొస్తుంది. కాని ధైర్యంచేసేదిగాదు. ఒకసారి తనని పెండ్లి చేసు

కోమని అడుగుదామనుకుంది. అసలు తనంటే యిష్టముందో లేదో? ఏరోజుకారోజు అతన్ని అడగాలనుకుంటుంది కాని, ధైర్యంచేసేదిగాదు. తనతల్లితో మనసులోని మాట విప్పిచెప్పి దామనుకుంటే సిగుదొంతరలు ఆమెను ముంచేవి. తను చేయ బోయే పనిలో, వ్యూహాల్లో ఏమీ పొరపాటు పడటంలేదనే ఆమె నమ్మకం. అయినా ప్రేమించింది. పెళ్లిచేసుకోవాలను కుంటోంది, అయితే? అతని యిష్టంకూడా అవసరమే. అయినా మగవాడికి ఎంతలోకి వస్తుంది ప్రేమ.అసలు మగవారికి ఏదైనా తొందరే!

రాజు అందాన్ని చూసి ప్రేమిస్తోందా తను? అయితే అతనికంటే అందమయినవాళ్ళు ఎంతోమంది తనని భార్యగా కోరారు! ధనమా? అతనికన్న తనకే ఎక్కువవుంది. ఇద్దరూ ఒకేతరగతి. మరి అతను తనకంటే ఎట్లా ఎక్కువైనట్లు?అన్నింటి లోనూ గొప్పగానే కనిపించేది తనమట్టుకు తనకి; అందువల్లనే అతనిమీద మాటపడ్డా, నిందపడ్డా తను అంతగా బాధపట్టానికి కారణం.

♦ ♦ ♦

పొద్దుపోయింది. రాజమ్మ ఎదురుచూస్తోంది ఎవరి కోరకో! ఎంతసేపటికీ ఎవరూ వస్తున్న చప్పుడు లేదు. గడియా రం పదకొండు గంటలు చూపుతోంది. నిద్ర రాకపోయినా మత్తుగా వుంది. పిల్లలు చదువుకొనేందుకు మేడపైకి వెళ్ళారు. తాను ఒంటరిగా క్రింద అంతస్తులో నీలం వెలుగులో కూర్చుని ఆలోచిస్తోంది. దూరంగా బయట వెన్నెల కురుస్తోంది...

తలుపు గడియ వేసి పడుకుందామని గడపదగ్గరకు వెళ్లింది. కొంచెంసేపు నిలబడి బజారులోకి చూస్తే, సైకిల్ వస్తున్న చప్పుడు మరి కొంచెంసేపటికల్లా వాకిట్లో ఆగింది. ఆ వచ్చిన వ్యక్తి లోపలికి సైకిల్ చేసుస్తో—

"ఏం రాజూ! అలా వున్నావేం?" అన్నాడు ఆప్యాయంగా.

రాజమ్మ ఏమీ మాట్లాడలేదు. బయటితలుపు గడియ వేసి వచ్చింది లోపలికి.

ఆమెవాలకం చూసి తిరిగి ప్రశ్నించాడు. 'ఏం చెప్పవ్! అలా వున్నావేఁ! చెప్పు?' అంటూ ఆమె కూర్చునివున్న సోఫా లోకి వచ్చి కూచుని లాలనగా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. రాజమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. అతని కళ్లల్లోకి చూస్తూ 'ఏంలేదు డాక్టర్' అన్నది. డాక్టరు కొంచెంసేపు మాట్లాడించకుండా స్థిమితంగా వుండనిచ్చాడు.

డాక్టరు రాజమ్మసంసారానికి డాక్టరుగానే పరిచయమైనాడు మొదట. అది ఆమె భర్త వున్నప్పుడే. భర్తకు జబ్బుగా వున్నప్పుడే మందు వాడటం ప్రారంభించాడు. రాజమ్మభర్తను శతవిధాలా ప్రతికించాలనే చూశాడతనూ. కాని అతనికి ఆయుర్దాయం లేకపోతే తనేంచేస్తాడు? తనేం ప్రాణం పోయగలడు గనక?

రాజమ్మభర్త చనిపోయిననాటినుండీ డాక్టరు ఓకంట ఆమెను కనిపెడుతూనే వున్నాడు. ఆమె నెదుర్కొనే కష్టసుఖాల్లో భాగం పంచుకునేందుకు ప్రయత్నిస్తూంటాడు. ఆమెకుగూడా చెప్పుకోదగ్గ బంధువులు— తనవైపువాళ్ళుగాని, భర్తవైపువాళ్ళు

గాని లేకపోబట్టి పైకిరావాల్సిన పిల్లలున్నారుగనుక ఆయనగారి సలహాలు పాటిస్తూవచ్చింది చాలాకాలం.

ఇప్పటికీ అంతే. ఆయన డాక్టరుగారు గనుక, పగలు తీరిక వుండదుగనుక రాత్రిళ్ళుమాత్రమే వస్తూపోతూంటాడు.

డాక్టరుగారు రాజమ్మ యింటిమనిషిక్రిందనే జమ. ఈ విషయం పిల్లలకూ తెలియకపోలేదు.

...డాక్టరుగారు చాలాసేపు వుండి వెళ్లిపోయారు బైటికి. రాజమ్మ ఒక్కతే తిరిగి తలుపు గడియవేసుకొని పండు వుంది సంతృప్తిగా. పన్నెండుగంట లయింది. ఆమె మనస్సు సరిగా లేదు. తనెట్లు ప్రవర్తిస్తున్నదీ అందరికీ తెలుసు. తనను చూసి పిల్లలు చెడిపోతారేమోనని ఆమె భయం. ఏదో వాళ్ల నయినా ఒక యింటివాళ్లను చేద్దామని ఆశ. కాని ఎక్కడా అందిరావటంలేదు సంబంధాలు. తను తలుచుకొంటే చాలా సంబంధాలు కొనగలదు. కాని ఈడూ జోడూ, యిష్టాయిష్టాలు, పిల్లలకి నచ్చటాలో?

రాజమ్మ మేడపైకి వెళ్లింది. లైటు వెలుగుతూనేవుంది. సోఫాలో కూర్చుని రాజు చదువుకుంటున్నాడు. ప్రక్కగా మంచంపై సరోజిని- పుస్తకం గుండెకానించుకుని నిద్రపోతోంది నిశ్చింతగా. మెత్తని జుట్టు మంచంమీద చిందరవంద రగాపడివుంది. సుశీల అవతలగా బెడ్‌మీద పండుకుని నిద్రపోతోంది. రాజమ్మ రావటం ఆతను గుర్తించలేదు సీరియస్‌గా చదువుకుంటూ.

రాజమ్మకు ఏంమాట్లాడాలో తోచలేదు. ఇంత అర్ధరాత్రివేళ ఒంటరిగా వున్నప్పుడు పలకరించక పోతే ఏమనుకుం

టాడ్డో? తనను అనుమానించడుగదా? ఛీ! అన్నీ పాడు వూహాలు. ఏమిటి తన కీ విపరీతం! అనవసరంగా ఆ అబ్బాయిని అనుమానించటం – తన మెతకదనాన్ని నిరూపించుకోవటం? రాజమ్మకు సిగ్గేసింది. తిరిగి వెళ్లిపోతోంది తొందరగా.

రాజమ్మ కాళ్ళతొందర రాజుని మైకంలోంచి జాగృతిలోకి తీసుకొచ్చినది. చూచాడు. రాజమ్మగారు! అతను నమ్మలేక కళ్ళు నులుముకు చూచాడు. రాజమ్మగారేనా? అయితే ఎందుకొచ్చింది? అసలు వచ్చి ఎంతసేపయిందో! ఎప్పుడూ తను వుండగా రాలేదు మైకి. అతనిలో ఆత్రుత ఎక్కువైంది. తొణికిసలాడే కంఠంతో—

'ఎవరూ? రాజమ్మగారా?'

రాజమ్మ వెనుతిరిగి చూచింది.

'మీరేనా! ఎవరోనని చూస్తున్నాను లెండి!' అన్నాడు రాజు నిమ్మళం తెచ్చుకొంటూ.

'నేనే!' అన్నది ఆగి.

'ఏదోపనిమీద వచ్చినట్టున్నారూ? అమ్మాయిని లేపమంటారా?' ఎంత చనువు అమ్మాయి మీద అతనికి!

'అవుసరంలేదు నాయనా!' అని అట్టాగే నిలబడివుంది.

అలాగే నిలబడి వున్నారే? రాండి కూచుందురుగాని.'

రాజమ్మ దగ్గరకు వచ్చింది. తీక్షణంగా చూస్తోంది, సిగ్గు తెరల్ని తొలగించుకుంటూ.

'ఓ పదినిమిషాలు క్రిందికి రా—'

'ఇప్పుడా!' అన్నాడు రాజు దిమ్మరపోయి.

'ఊ, కొంచెం మాట్లాడాలి.'

ఇద్దరూ మేడ దిగారు. సోఫాలలో ఎదురెదురుగా కూర్చుని వున్నారు. ఎవరు ముందు పలకరించాలో ఎవరికీ తెలియటంలేదు. మాట్లాడాలని తీసుకొచ్చిందేగాని, ఏం మాట్లాడాలో అర్థంగావటంలేదు పాపం రాజమ్మకు. రాజు అలాగే కూర్చొని వున్నాడు ఆమెవైపు చూస్తూ—ఎప్పుడు ఏం అడుగుతుందో నన్న ఆత్రుతతో.

'రాజూ!'

రాజు వులిక్కిపడి చూశాడు ఆమెవైపు.

ఆమె తల వొంచుకునేవుంది యింకా.

'ఏమండీ?'

'ఓ పెద్దవిషయం నాయనా! బాగా ఆలోచించి చెప్పు.

'అలాగే, అడగండి.'

'అంతేగాదు. జీవితాంతం వరకూ సంబంధించి వుండే సమస్య. ముందు వెనకలు బాగాఆలోచించాలి చూచావూ?'

జీవితాంతం ఆలోచించవలసిన విషయాలు గానీ, ఆ సంబంధమైన సమస్యలుగాని అతని కేమీ లేవు నిజానికి. తల్లీ, దండ్రీ, దైవం ఎవరూ లేరు బాధించేందుకు. అదే రాజుకీ అనుమానం. ఏమిటి రాజమ్మ అడగబోయేది? తన జీవితాంతానికి సంబంధించిన విషయా లేమిటి

'ఏమిటి చెప్పండి—చెపుతాను' అన్నాడు.

'ఇదేం కొత్తవిషయ మేమీకాదు రాజూ! నీకూ తెలిసిందే.

దీంతో రాజు మరీ తికమకలో పడ్డాడు. ఏమిటో తనకే తెలుసట! మరీ ఆశ్చర్యం.

'నా కేం అర్థంగావటం లేదు మీ రనేమాటలు. చెప్పండి. ఏమిటి?' "ఏముంది రాజూ – జీవితం అన్నాక అందులో ఆడ వారి సంగతి అడిగేదేముంది. చెప్పా? నేనూ పెద్దదాన్నయి పోతున్నాను. అయినా కాకపోయినా ఏ యీడప్పుడు ఆ ము చ్చట్లు జరిగితేనే బావుంటుంది, ఏమంటావు?"

ఆమె మాటల ధోరణినిబట్టి చూస్తే షష్టిపూర్తి మహో త్సవం చేయించ మంటుందా అనిపిస్తోంది. కాని తనకి సంబంధిం చిన విషయమట పైగా.

'ఏమిటో తేల్చి చెప్పండి' అన్నాడు.

'సరోజిని విషయమే రాజూ – యీడొచ్చిన పిల్ల. అచ్చటా ముచ్చటా అన్నారు. అదే నే ననేదిన్నా! ఏమంటావు?'

రాజు నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డది పాపం. తల్లో చేయిదూర్చి ఆలోచించుతూ కూచున్నాడు.

రాజమ్మకు తెలుసు రాజు యిప్పుడు పెళ్లిప్రస్తావన రానీయడని. పైగా ఈమధ్య వచ్చిన రెండు మూడు సంబం ధాల్ని తిరగగొట్టాడు. 'నా కవసరంలేదు, నేను వెతకవలసిన పనిలేదు, అయినవా ళ్ళున్నా' రని. రాజుకి అయిన సంబం ధాలు లేవని ఆ వచ్చినవాళ్లకు తెలుసు. అయితే రాజమ్మతో చెప్పిపోయినారు వచ్చినవారు. అసలు రాజుకు చదువు పూ ర్తయిందాకా పెండ్లిచేసుకోటం యిష్టంలేదు. ఆ సంగతి అంద రెరిగిందే.

రాజు ఎటూ చెప్పలేకపోతున్నాడు. రాజమ్మగారు ఎవరో తనకి తెలుసు. కాని తనెవరో వారికి తెలియదు.

తెలియనిస్తేగా! పాపం రాజమ్మగారు భ్రమిస్తున్నారుగావును. ఎంతమోసం, ఎంతమోసం! తను ఆ విషయం యింతకాలం దాచబట్టెగదా రాజమ్మగారు మోసపోవటం. తనకు తనే వూహించుకోలేకపోతున్నాడు.

'క్షమించండి...నాకో సంబంధం...' అని నసిగాడు.

రాజమ్మ గ్రహించింది. అతని వుద్దేశం. అతను అనుకునేలాంటి సందేహాలు ఆమెకు లేవు. అస లా పట్టింపులే లేవు.

'మరేం ఫరవాలేదు నాయనా, అలాంటి పట్టింపులు పోయి ఎంతకాలమో అయింది' అని నవ్వింది.

రాజుకు యిక రెండోదిగులు పట్టుకుంది. వాళ్లకు గల తాహతుకు, తన తాహతుకు ఏమిటో సాపత్యం. సరోజ గొప్ప సంస్కారహృదయం గలది, చదువుకున్నది. తనకంటే గొప్పవాణ్ణి చేసుకోవడానికి అర్హురాలు మరి...

రాజమ్మవైపు తిరిగాడు. ఆమె తనవంకే చూస్తోంది ఆ క్షణం.

"మీరు పొరపాటు పడటంలేదుగదా?" అన్నాడు.

"అదేమిటి రాజూ?"

"ననూ్న, నా తాహతూ, శక్తీ తెలుసుకునే అడుగుతున్నారా?"

"అవసరంలేదు, తెలియనవసరంలేదు రాజూ!"

"మరి?"

"ఏం! నీవు మావాడివి. నీ కేమున్నా, లేకపోయినా మాకు నిమిత్తంలేదు. ఈ వున్నది చాలకనా చెప్పు! మన లాంటివాళ్ళు మరో పదిమంది బ్రతకొచ్చు. వీంతక్కువ?"

"మరి తక్కువనిగాదు—నా స్థిమితం ఆలోచిస్తున్నా."

'నీ స్థిమితం ఏమిటి? స్థితి ఏమిటి—చెప్పు— యిదంతా ఉంది కదూ?'

ఆమెలో సనాతన సిద్ధాంతాలకు తావు లేకపోయినా, యింత సంస్కృతి వున్నదని అనుకోరు ఎవడున్నా. ఆ వున్న ఆస్థికి, డబ్బుకూ ఎంతగర్వం, హోదా, ఠీవి వుండాల్సింది! కాని రాజమ్మలో అవేవీ మచ్చుకి కూడా కనపడవ్.

రాజు ఆమెగారిని బాగా అర్థం చేసుకున్నా. తరువాత ఏమీ మాట్లాడలేకపోయినాడు. ఆమెకు ఎదురుచెప్పటం అతని వల్లగాలేదు.

రాజమ్మ కళ్లు చెమర్చినయ్. ఇంతవరకూ 'రాజు ఆ మాట అంటాడా, అనడా అని పరిపరివిధాల తలపోస్తున్న రాజమ్మ ఊహలు సౌధాలయినయ్. రాజమ్మ సంతోషం పట్టలేక మేడపైకి వెళ్ళింది కూతుర్తో చెప్పటానికి.

సరోజిని నిద్రపోతూంది. రాజమ్మ 'సరూ' అంటూ లేపింది. సరోజిని నిద్రకళ్ళతో లేచి 'ఏమిటే' అన్నది.

'నీకో మంచి మాట చెబుతా లేమ్మా లే'

సరోజ నిద్రకళ్లతో లేచింది.

రాజు మేడపైకి వస్తున్నాడు అప్పుడే. రాజమ్మ సరోజిని చెవిలో ఏదో చెప్పుతోంది. సరోజిని కళ్ళలో నిద్రమత్తు పోయి ఆకాంక్ష, ప్రేమ నిండుకుంది. మత్తుగా రాజువైపు తిరిగింది.

రాజు కొత్త పెండ్లికొడుకులాగా చూశాడు సరోజిని కళ్లల్లోకి.

28.8.54

56

రావలసిన భావ విప్లవం

కథ రాయబోతున్న వాడినల్లా ఆగి తలెత్తి చూశాను. అర్ధరాత్రి. పక్కనే మంచంమీద రాధ పడుకొనివుంది. జుట్టంతా రేగి నాచులాగా పరుచుకొనివుంది. మధ్యలో తెల్లగా కలువ పువ్వుమల్లే రాధ ముఖం వెలుగుతోంది. గాఢనిద్రలో పైట తొలిగిందనే విషయం రాధకి తెలీదు పాపం! దీపం వెలుగు తూనేవుంది డ్రాయరుమీద. అట్లాంటి యౌవనాంగి ఆహ్వానిస్తూండగా ఈ తెల్లకాగితాలను నలుపుచేసే దౌర్భాగ్యమేమిటి? ఇప్పటిదాకా రాధ అల్లరితో సరిపోయింది. కథరాయబోయేసరికి ఈ తద్దినం వొచ్చింది. ఎవరితడు? అర్ధరాత్రి. తలుపులన్నీ బిగించాను నేను. ఎట్లా వొచ్చాడు, భార్యాభర్తల గదిలోకి – ఏకాంతంగా వున్నప్పుడు?

'ఎవరు నువ్వు?'

'నన్నే మర్చిపోయావుట్రా! అవును. మర్చిపోక ఏం చేస్తావులే! ఇప్పుడు నాతో అవసరం తీరిందిగా! నన్ను జ్ఞాపక ముంచుకోవలసిన బరువుగూడా లేదు మరి' అన్నాడు.

తలా తోకాలేని ఈ సంభాషణ నాకు తలనొప్పి ఎత్తించింది. అతను నా అనుమతిలేకుండానే పక్కనవున్న కుర్చీలో కూచొని రాధకేసి చూస్తున్నాడు. నాకు మండిపోయింది.

ఎవడీ గాడిద? నా రాధవైపు...అవేంచూపులు, వెధవచూపులు. నేను లేచి రాధనిసర్దిగ్గా పడుకోబెట్టి దుప్పటి నిండా కప్పి కొంత వరకు తృప్తిపడ్డాను.

'ఇదేనా! ఇదేనట్రా నీ సంస్కరణ? మళ్ళీ పెద్ద పెద్ద వ్యాసాలు రాస్తావే పత్రికల్లో. స్వేచ్ఛానురాగ సిద్ధాంతాన్ని కథల్లో పొగుడుతావుగా! నీ పెళ్ళాన్ని ... అదిమరింత చక్కని దయితే గోషాలో వుంచేవాడి వనుకొంటాను. చూస్తున్నానని దుప్పటి కప్పేశావా?... ఛీఛీ...రాత్రుల్లోవున్న గొప్పతనం జీవితంలో మీ రెందుకు అందుకోలేరు? ఈ రచయిత్రలున్నారే వీళ్లు రాసేంత గొప్పగా జీవితాన్ని అనుభవించలేరు. అంతా దొంగతనం, అబద్ధాలు!'

అందరి రచయితల తరఫునా తలొంచు కొన్నాను. మనిషి డొక్కశుద్ధి ఉన్నవాడికిమల్లే కనిపించాడు. ఫ్లాస్కులోని 'టీ' రెండు కప్పుల్లోపోసి ఒకటి నేను తీసుకొన్నాను. టీ తాగుతూ అన్నాడు—

'నాలుగేళ్ళకిందట నేనూ యిల్లాగే ఫ్లాస్కుల్లోపోసుగుని టీ తాగేవాణ్ణి. నీ చలవవల్ల ఇట్లా అయ్యాను.'

అతన్ని నే నెక్కడో చూసినట్లు గుర్తు. రెండుమూడు గంటలు మాట్లాడినట్లుగూడా కొంచెం జ్ఞాపకం. అయితే పేరు తెలీదు. ఒకనాడు గొప్పగా జీవితాన్ని అనుభవించినవాడే ననే విషయం అతని శరీరంలోని ఏ భాగం చూసినా తెలుస్తోంది. అతను నాకు పరిచితుడనే విషయం కాదన లేను. అయితే 'ఫలానా' అని స్పష్టంగా చెప్పలేను. అతని పతనానికి నేవే ఎట్లా కారణమోకూడా నాకు తెలీదు.

'ఎవరు నువ్వు?' మళ్ళీ తొలిప్రశ్న.

'అవును, జ్ఞాపకం వుండదు. ఆ స్టేజీ దాటిపొయ్యావు.

'క్షమించండి, గుర్తించలేదు.'

'నా పేరు రావుసాహెబ్ ధర్మారావు.'

మెదడు గాలిస్తున్నాను.

'నీ కొడుకుని' అన్నాడు కిసుక్కున నవ్వి.

నాకూ నవ్వొచ్చింది. యాభై ఏళ్ళ ముసిలిడొక్కు-అతను. ఇరవైమూడులో నడక నాది. రాధ కాపరానికొచ్చి నాలుగునెలలేనా కాలేదు. ఇతర్రా ధర్మసంతానం విషయం అంటే పంకజానికి పుట్టింది ఆడపిల్ల అమృణ. ఇతను నా కొడుకట. మనిషిలో హ్యూమర్ చావలేదింకా.

'నవ్వుతావేం? నీవు నా తండ్రివి. నేను నీ కొడుకుని. భయపడబోకురా నాయనా! నీ ఆస్తిలో భాగం పెట్టమని అడగన్లే. అయితే ఎందుకొచ్చానంటావా? నీకు నా గతి చెప్పడానికి. నీ తప్పులు చూపెట్టటానికి.'

మొదటికీ యిప్పటికీ భేదం లేదు నాకు.

'తెలీదుకదూ? తెలీదురా తండ్రీ! తెలీదు. చెబుతాపట్టు. నేను నీ కొడుకుని; అంటే నీ కథలో పాత్రని. నాలుగు సంవత్సరాలక్రిందట నన్నుగురించి కథరాశావు. నాపేరు రావు సాహెబ్ ధర్మారావు. నాకు నాలుగు మిల్లు లుండేవి. రెండొందలెకరాలు మాగాణి వుండేది. నాది నాలుగంతస్తుల మేడ. మేడమీదినుండి కిందికి దిగను. సిల్క్-లాల్చీ మునుగుతుండేవాణ్ణి. ఎయిర్ కండిషనర్ ఎప్పుడూ నా పక్కనే వుండేది. నాలుగు పెద్దకార్లు నావి. ప్రజల్ని దోచుకొనేవాణ్ణి. కార్మికుల 'రొక్త

మాంసాలు' పీల్చేవాణ్ణి. సమాజాన్ని 'దోపిడి' చేసివాణ్ణి. ప్రజలనుండి 'దొంగతనం' చేసిన డబ్బుతో నేను 'రావు సాహెబ్' నయ్యానను. ముండలముఠాకోరుని. తాగుబోతుని. కూలీల కొంపలు తగలబెట్టించినవాణ్ణి.'

"నువ్వా! జ్ఞప్తికొచ్చింది, నరరూపరాక్షసి! కథలో నాయకుడివి నువ్వేగదూ? అయితే యిదేమిటి? ఈ గోనె పట్టాలు, పుళ్ళు, పెరిగిన జుట్టు, జోరీగలు..."

నవ్వాడు.

"ఇదంతా నీ చలవే"

"ఏంచేశానుగ?"

'నామూలంగానే సమాజం యిట్లా అవకతవగ్గా వుందని రాశావు. నా ఆస్తినంతా ప్రజలపరం చేస్తే సమాజం సుఖంగా వుంటుందని రాశావు.'

'అవును రాశాను. అట్లా వుండటం మంచిదేగా?'

'మంచిదే! ఇదిగో యిదే మంచి.'

'ఏం?' అన్నాను అయోమయంగా. నా సిద్ధాంతంలో ఎక్కడ పొరపాటుబడ్డానో నాకు తెలీలేదు.

'నీమాటప్రకారం ఆస్తినంతా ప్రజల కిచ్చేశాను. పొలం కవులుదార్లకిచ్చేశాను. డబ్బు పంచిపెట్టాను. మేడ పాతిక కార్మిక కుటుంబాల కిచ్చాను.'

'భేష్! యింకేం! యిప్పుడు వాళ్లంతా సుఖంగా జీవిస్తున్నారుగదూ?'

'అదే లేదు.అట్లా జరిగితే నేనూ సంతోషించివుందును.'

'మరి?...'

"తొందరపడబోకు. చెబుతా వినుు నా మిల్లులు దానం గ్రహించినవాళ్ళు సుఖంగా వ్యాపారం చేసుకొంటున్నారు. కవులుదార్లకు పొలం కొంచం ఎక్కువొచ్చింది నిజమే! అంత మాత్రాన వాళ్ల దరిద్రం పోలేదు. మరొక భూస్వామిపొలం కవులుచేస్తున్నారు. డబ్బు పంచితే తలకు నాలుగు రూపాయలు రాలేదు. పాతిక కుటుంబాల కార్మికు లా మేడ నమ్ముకొని వొచ్చిన డబ్బుతో కొందరు చెడతాగారు. కొందరు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొన్నారు. నేనుమాత్రం యిట్లా తయారయాను కూటికీ గుడ్డకూ మొఖంవాస్తూ.."

"అబద్ధం. ను వ్వట్లా చెయ్యలేదు. దొంగమాట చెబుతున్నావు నాతో" ఉరిచాను బిగ్గరగా.

"అరవబోకు. అవతల శ్రీమతి లేస్తుంది. నేను చూస్తాను. ఖర్మంజాలక నే నామెను ప్రేమించినా ప్రేమించవొచ్చు. అదిగో! అప్పుడే మొఖం మటమటలాడిస్తున్నావు. పోన్లే, ఆ గొడవెందుగ్గాని...ఆఁ, ఏమన్నావ్? అబద్ధమనిగదూ? కాదు. నిజం! నిజం! ముమ్మాటికీ నిజం!,

"శుద్ధ అబద్ధం"

నీరసంగా నిట్టూర్చాడు.

"నే నొక్కణ్ణి ఆస్థి సంఘపరం చేసినంతమాత్రాన ప్రజాస్వామికం రాదు. ట్లా వొచ్చింది ప్రజాస్వామికం కాదు."

"మరేమిటి?"

"పెట్టుబడిదారీవిధానంలో ఒక పరివర్తన. మార్పు చెంది వట్లే కన్పిస్తుంది. కాని మార్పు చెందదు.

"నా కంతా గొడవగా వుంది."

మరో కప్పు టీ తాగి చెప్పాడు:

వ్యక్తిగతమైన పరివర్తన పరివర్తనకెందికి రాదు. మార్పనేది సంఘపరంగా జరగాలి.”

‘సంఘమనేది వ్యక్తుల సమూహం అయినపుడు,వ్యక్తులు మారినప్పుడు సంఘం మాత్రం ఎందుకు మారదు?’

నేను మాట్లాడలేదు.

‘నే నొక్కణ్ణి మిల్లు పెట్టినంతమాత్రాన, నేను వ్యాపారం చెయ్యనంతమాత్రాన సామాజికు లందరూ నా మోస్తరుగానే వుంటారనే నమ్మక మేముంది? దోపిడీ చేసేవాళ్ళను నిందించడం కంటే, వాళ్ళు దోపిడీ చెయ్యడానికి ఏ యే అవకాశాలు ప్రోత్సాహా మిస్తున్నాయో వాటిని నిర్మూలించడానికి ప్రయత్నం చెయ్యడం జరగాలి. అప్పుడు దోపిడిగాళ్లు తమంతట తామే దోపిడీ కార్యక్రమాన్నుండి బైటికొస్తారు.’

‘తినమరిగిన కోళ్ళు యిల్లు దిగుతయ్యా?’

‘దిగవు. దిగేటట్లు చెయ్యాలి’

‘అయితే వ్యక్తులు మారితే లాభం లేదంటారు. వ్యక్తుల తత్వాలు మారాలంటారు. అవునా?’

‘అవును’

‘మారాలనడం సులభమే. కాని, ఒకంతట మారడం కష్టం...మార్పులు రావాలంటే ఏం చెయ్యాలి?’

‘మీరు కావాలనుకొనేది ఏ మార్పు?’

‘వీటిల్లో మళ్ళీ రకరకాలా ఏమిటి?’

‘ఆర్థిక మార్పు, భావ మార్పు.’

'అన్నట్లు జ్ఞాపక మొచ్చింది. భావ విప్లవం కంటే ముందు ఆర్థిక విప్లవం రావాలని ఎక్కడో చదివినట్లు గుర్తు. ఎంచేతంటే ఈనాటి ఆర్థిక విధానమే యిట్లాంటి భావా లుండ డానికి కారణం. అయినప్పుడు వొక్క ఆర్థిక విప్లవాన్ని విజ యం చేసుకుంటే దానివల్ల భావవిప్లవ విజయంకూడా లభిం చినట్లేగా?'

'దేనిక్కైనా విలువలు తెలియాలి. తాగుబోతుకి వంద రూపాయలిచ్చి దాచుకోమంటే సారాతో స్నానం చేస్తాడు. వాడికి వందరూపాయల విలువ తెలియదు. కార్మికులకు నేను మేడ యిచ్చాను. అమ్మునొని చెడ తాగారు.ఆర్థికంగా అక్కడ మార్పు జరిగింది. కాని దాని ఫలిత మేమయింది? ఒట్టి ఆర్థిక విజయం నిండైన వ్యక్తిత్వాన్ని యివ్వలేదు.'

'కడుపులో పేగులు చుట్టలు చుట్టుకెళ్లే వాడికి కావల సింది తిండి. అదిలేకుండా నువ్వెన్ని శుష్క-ప్రియాలు చెప్పినా వాడు వినడు. అవతల ఆకలితో మాడుతున్న వాడికి నీ 'ధర్మ బోధ'లు చెవికెక్క-తాయంటే నమ్మలేకపోతున్నాను. ముందు కావలసింది తిండి.'

ఫక్కున నవ్వాడు.

'తిండి కావాలి.నిజమే! తిండి కావాలంటే ఈ పద్ధతుల్లో దొరకదు. సామాజిక విధానం మారాలి. విప్లవానికి ఈ నాడు సంఘంలోవున్న భావాలు' పచ్చి వ్యతిరేకం. మానవుని జీవితం మానవుని చేతిలోనే వున్నదనే విషయం ప్రతిమానవుడికీ తెలి యాలి. అప్పుడు ఏ అవసరంలేకుండానే వాళ్ళు తమ 'గతి'కి కారణాలు కనుక్కోగలుగుతారు. ఆ ఫలితాలే వాళ్లచేత విప్ల

వాన్ని జరిపించి విజయాన్ని సాధించి పెడతాయి. తన జీవి తాన్ని దేవుడు,కర్మల అధీనం చేసినంతకాలం మానవుడు దేన్నీ సాధించలేడు. ఆ పారతంత్ర్యాన్నుండి అతను ముందు బైట పడాలి. వడేటట్టు చూడాలి.'

అతని మాటలు వింటే నిజమే ననిపించింది నాకు. హఠా త్తుగా జ్ఞాపక మొచ్చింది.మధ్యలో అతను ఏ 'యిస్టో?'అడిగాను:

'నువ్వు కమ్యూనిస్టువా?'

'కాదు'

'రాయిస్టువా?'

'కాదు'

'పోనీ సోషలిస్టునను కొంటాను?'

'ఇదొక రోగం. నేను చెప్పేది నిజమైనప్పుడు నే నే 'యిస్టు'నైతే నీకెందుకు? నాకు ఏదో వొక యిస్టును అంటగట్టి వొక 'యిజం' అద్దంలోనించి నన్నెందుకు చూడగోరుతున్నానో అర్థంకావడంలేదు. నా భావా లేమిటో చెప్పాను. వీటిని యిట్లాగే ఎందుకు స్వీకరించలేవు?' నా భావాలకు వొక యిస్టు, మేకప్ యిస్తేనేగాని నీకు బాగుండదుకదూ? యదార్థాన్ని యదార్థంగా చూసే తత్వం నీ కింకా రాలేదు.

చప్పున కుర్చీమించి లేచి నాతో చెప్పకుండానే వెళ్ళి పోయాడు. ఏదో అడుగుదామని పిలిచాను. నా పిలుపు తిరిగి నా దగ్గరికే వొచ్చింది.

ఆ మె !

"జయా! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అంటుంటే మాధవయ్యగారి కళ్ళు ఎర్రబడ్డాయ్.

"అవును, మీతోనే!"

"అయితే నా మాట లక్ష్యపెట్టవన్నమాట?"

"ఇంతకాలంనుండి లక్ష్యపెట్టుకొండబట్టే....."

"జయా!"

"అవు న్నాన్నా!"

"ఏమిటి అవును. కూటికి, గుడ్డకు లేని బుక్కా-ఫకీరు సీతాపతి- వాడితోనా....."

"అలాగే కనిపిస్తారు మీ కళ్ళకు. ఇనపపెట్టెలనిండా లక్షలు మూలుగుతుంటే వా డెలాంటి నాపవెధవయినా గొప్పవాడు మీ దృష్టికి. కాని అసమాన ప్రజ్ఞావంతుడు, వక్త అయిన సీతాపతి నీచుడు. మీ విజ్ఞానం అంతలో వుంది."

"నా కడుపున తప్పబుట్టావే నువ్వు! వీ అడుక్కుతినే వాళ్ళకో పుట్టినట్లయితే నీ తిక్క కుదిరేది. తింటానికి, వుంటానికి మహారాజులాగా జరుగుతుంటే కళ్ళు అలాగే నెత్తికొస్తయ్. ఎవడిని ఎక్కడుంచాలో అక్కడే వుంచాలి. కోతిని తీసుకెళ్లి సింహాసనం ఎక్కిస్తే 'ఏమూతుంది? అప్పుడే ఎవడికో యిచ్చి ముడిపెట్టినట్లయితే కుదిరేది తిక్క. కాలేజీ చదువులకని వంకబెట్టి నాపవెధవని 'లా' చేస్తానంటావా? ఛీ!"

"నాన్నా! పొరపాటు."

"ముయ్ నోరు. నా ముందు అధికంగా వాగబోకు!"

"అయితే!"

"ఏమిటి అయితే?"

"సీతాపతిని వీల్లేదంటారా!"

"అంటారా! అంటారా యేమిటి యింకా! ఈ సారి నా కంటికక్కనిపించనీ, మక్కెలు విరగదంతాను. వాణ్ణి. దొంగ వెధవ. నీ అమాయకత్వాన్ని కనిపెట్టి వలలో వేసుకున్న నీచుడు. చాల్లే యిక నీ చదువులు. కాలేజీ వొద్దు, యేంవొద్దు. కొంపలో పడివుండు."

"జయ మీ కూతురు కాదనుకోండి.అసలు జయ పుట్టనే లేదనుకోండి."

"ఏమిటో?"

"అదే చివరివాక్యం నే చెప్పదలచుకుంది. జయ ఈ నాటితో చచ్చిపోయిందని చాటండి!"

"ఏం? ఏం అఘాయిత్యం చెయ్యబోతున్నావ్?"

"అదంతా మీ కనవసరం యిక. నా దోవ నే చూచుకుంటున్నాను."

"ఆ సీతాపతితోనేనా?"

"అవును!"

"పో!త్వరగా పోవేం? నా కంటికక్కనిపించకుండా పో... ఊఁ!"

♦ ♦ ♦

చాలా పొరపాటు జరిగింది జయా!"

"ఏమిటి పొరపాటు."

"నీవు అసలు యింట్లోంచి వొచ్చెయ్యటం"

"ఓ, అదా! మరేం ఫరవాలేదు."

"ఫరవాకాదు. ఎంతయినా కన్నతండ్రి. బోలెడంత ఆస్తి. అదంతా వొదిలిపెట్టుకొని"

"ఆస్తి! వెధవాస్తి, డబ్బు మానవునికి సంతోషాన్నిస్తుందనా మీ వుద్దేశ్యం?"

"కాకపోయినా కష్టించకుండా"

"ఆ నీచమైన, కూడబెట్టిన డబ్బు తగలేసేకంటె అడుక్కుతింటో సుఖంగా బ్రతకటం చాలా మంచిది నా వుద్దేశంలో. ఏమంటారు?"

"అనేందుకేముంది? అంతా ఏమంటారు? ఫలాని జయకి సీతాపతి మందుపెట్టి లేపుకెళ్ళాడంటారు అవునా?"

"కాదు, ఫలాని జయ సీతాపతిని ప్రేమించి..."

'చూడు! నాతో జీవితం గడపడం అంత తేలికైన పని కాదు. తల్లి, తండ్రి, ఏ యితర బంధువులు లేనివాడిని. అంతా నన్ను బయటకు నెడ్తారు. యింతకాలం నే నలా బ్రతుకుతున్నానో నీకు తెలుసుగా. డబ్బుకు అవసరమై నీ దగ్గర కెంత పుచ్చుకున్నానో నీకు జ్ఞాపకంలేదూ? యింతవరకు తిరిగియిచ్చే ప్రయత్నంలోకూడ లేను."

"పోనీ, యీవిధంగా యిస్తున్నారుగా!"

"నాతో పడవలసిన కష్టాలకు నీ సుకుమార ప్రాణం ఓర్చుకోలేదు పాపం!"

"అన్నిటికీ వొప్పుకున్నానండీ!"

"మాటల్లోనే కాని, ఒక్కపూట తిండిలేక, చేతిలో కానీ లేక నకనకలాడుతూ గడిపిన దినా లున్నయ్. అవన్నీ తలుచుకొని, నిన్ను తలుచుకుంటె ఒక్క ఏడుపు, విచారం మినహా నా కేం మిగిలేటు కనిపించటంలేదు."

"మీరు నాకు తోడా చేస్తున్నారు!"

"క్షమించు!"

♦ ♦ ♦

"అదే రేపు మీటింగులో చెప్పబోతున్న విషయం" అన్నది జయ.

'ఏమి టది?'

'లిబర్టీ, ఈక్వాలిటీ కావాలి. చాలా అవుసరం మాన వుడికి.'

'కాదని ఎవరన్నారు?'

'అదికాదు. ఈ కోటీశ్వరులు, లక్షాధికారులు, పావు కా ర్లున్నా రే! బొగ్గరలు పెంచుకున్న కుబేరులు– వీ ళ్ళందర్ని లెటుస్థంభాలకి వ్రేలాడదీయా లసలు. అప్పటిగ్గానీ ఆర్థికస్వాతం త్ర్యం రాదు.'

నిజమే, రష్యన్‌విప్లవం అలాంటిదనే విన్నాను.'

'అనేకాదు సీతాపతీ! లేకుంటే మరోమారం లేదు. లేకపోతే తిండికీ, గుడ్డకు లేక వేలకు వేలు, లక్షలకు లక్షల జనం ఆబాలగోపాలం చస్తుంటే యినప్పెట్టెల్లో చదలుపట్టే కరెన్సీని ఎందుకు ఖర్చుచెయ్యారాదో దుర్మార్గులు!'

అనుకున్నంత తేలిగ్గాదు జయా! నీవు చెప్పే విషయం నిజమే; ఒప్పుకుంటా. కానీ, ఫలితం...'

'అంతా అలాగే ననుకుంటూ చేతులు ముడుచుకుని కూర్చుంటే సరి, బాగుపడుతుంది పరిస్థితి. అన్నిటికీ వెధవ అను మానాలు. ఏ పనీ ధైర్యంతో చెయ్యడం లేదు. అందుకనే మన యిండియన్నుకు.....'

'నువ్వో పెద్ద రష్యన్‌లా మాట్లాడతావేం?

'కాదనుకో. కాని భావాలు ఎవరిలో లేకుండా వుంటయ్?'

'అవుననుకో... ఎవరికో వస్తోంది... టెలిగ్రాం... అవునా'?

'అవును... ఎక్కడ్నుండో... మద్రాసునుంచి కమల యిస్తుందనుకుంటూనే వున్నాను...'

'కమల కాదులే. మా ఫ్రెండ్ టెలిగ్రాం యిస్తాను, వెంటనే రమ్మన్నాడు.'

'బాగుంది'

సీతాపతి టెలిగ్రాం చదివి 'యిదిగో యింద ... మీ నాన్న'

"మా నాన్న !!"

'ఏం, అంత ఆశ్చర్యం!'

"ఎలా ఫ్రాశాడబ్బా!'

'డబ్బా!?"

'డబ్బు కాదండీ. (చదివి) అయ్యో! జబ్బుగావుందటండీ. సీరియస్..."

"పోనిత్తూ!"

'మిమ్మల్ని గూడా రమ్మని ఫ్రాశారు'

'పోనీ, నీవు పోయి రా, రేపు మీటింగు నే చూస్తాను'

'పోనీండీ వెధవ మీాటింగులు, పోస్టుపోన్ చేసుకుంటారు. మన ముంటేనే మీాటింగు, లేకుంటే పికిటింగేగా'

'తప్పదంటావ్ !'

'నే ననాాలాయేం'

♦ ♦ ♦

'నాన్నా!' ఏడుస్తూ జయా, సీతాపతి వచ్చారు.

'ఇంకా యేంనాన్న తల్లీ. బ్రతికినంతకాలం ఆయన కడుపులో చిచ్చుపెట్టావు. ప్రాణం పోయేప్పుడుకూడా నీ కలవరింపే. పాపం! ఆ అబ్బాయి- సీతాపతికి ఏదో ద్రోహం చేశానని తెగ కలవరించాడు.'

'జయా! వూకుకో, అంతా అయింతర్వాత ఏడ్చి ఏం లాభం?'

'కాదు బాబాయ్...చివరిసారి చూడకుండానే...'

'మన ఖర్మ తల్లీ ఏంచేస్తాం చెప్మా. నీ కా ప్రాప్తం లేదు..... అన్నట్లు బ్యాంకులో కామ్ మొత్తం రెండులక్షల పదకొండువేలు నీ పేర ట్రాన్స్ఫర్ చేశారు మీా నాన్న. ఈ యిల్లు అదీ యిక నీది. పాపం! చచ్చి ఏలోకాన వున్నాడో గానీ. ఎప్పుడూ నీ కలవరింపే. మహానుభావుడు. ఏం నాాయనా సీతాపతి! యిక నీవు, అమ్మాయి జయా... వస్తా... పొద్దు పోయింది'

♦ ♦ ♦

సీతాపతి ఈజీచైర్లో కూర్చొని సిగరెట్ కాల్చుకుంటున్నాడు. జయ మాగజైన్ చదువుతూ ప్రక్కనే పచారు చేస్తోంది.

'ఉత్తరం సార్!' పోస్టుమేన్ కేక.

'అందుకో జయా!'

'ఊ, తీసుకోండి'

'చదువు!'

చదివింది...

'మీాటింగులట, మీాటింగులు! ఎప్పుడూ వెధవలకు పని లేదు. మీాటింగులు, తీర్మానాలు. ఫలించేవా! చచ్చేవా! వీళ్ళ రిజల్యూషన్లు. ఏదో తిన్న దరక్క...'

'మన కట్లాగే అవుపిస్తుంది.'

'ఎవరికై తేమాత్రం?' జయకళ్లల్లోకి కోపంవచ్చింది.

'ఎప్పుడూ దరిద్రమే. వెధవ దరిద్రం! అయినా ఒక్కరు చేతుల్తో తీసేసేదా చెప్పండి. ప్రభుత్వమే గుడ్డిగా వున్నప్పుడు ఎవరుమాత్రం ఏంచేస్తారు?'

'కానీ, మానవుడు ప్రయత్నించాలి. విప్లవాలు ఎందుకనుకున్నావ్?'

'విప్లవాలు! వీళ్ళంతా బాగుపడతారనా?'

'మరి!'

'ఎవడి సొమ్మో తేరగా దొరుకుతుంది, కాజేద్దామని ఆశ. కూలిముండాకొడుకులు కూలి ముండాకొడుకుల్లా వుండ కూడదూ? వీళ్లకి మిల్లుల్లో, ఫ్యాక్టరీల్లో భాగాలు దేనికి?'

'అదేంటి జయా! నిన్న మొన్నటివరకూ విప్లవాలు కావాలని, సమ్మెలు కావాలని మీాటింగులు చెప్పావుగా?'

'అవును. అప్పుడు అదే మంచిదనిపించింది.'

'ఇప్పుడు లక్ష్యాధికారి వయ్యేసరికి ఇది మంచిదయింది. అంతేనా?'

'పోనీ, అంత సరదావుంటే మీరు పొండి.'

'పిలిచింది నిన్ను, పోవలసింది నువ్వు. మధ్య నేనా పోవటం? ఏదో అంటారే, కందకులేని దురద చేమకెందుకు చెప్పు!'

ప్రజాజీవితాన్ని అతి సహజంగా ప్రతిబింబించే నాటకాలు.

ప్రదర్శింపతగినవి

అశాంతి	రు. 1-8-0
పేదరైతు	1-0-0
గుమాస్తా	1-4-0
నర్తార్ భగత్సింగ్	1-8-0
సందేశం	1-4-0
పల్లెపిల్ల	1-8-0
పేదపడుచు	1-8-0
స్వతంత్రభేరి	1-4-0
ధర్మదీక్ష	1-8 0

• ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ - 1

మా నిషాద

ఇంటర్ చదువుతూండగా పెళ్ళయింది పార్వతికి.అయినా ఆమె చెప్పుకోదగ్గ ఉత్సాహాన్ని ప్రదర్శించ లేకపోయింది. పెండ్లికూతురుమాట ఎట్లాగయినా వుండనీండి. యింట్లోవారి సంబరానికి పట్టపగ్గం లేకుండాపోయింది. కారణం అందరూ అనుకున్న సంబంధం కలిసిరావటమే. మేనమామకే పార్వతి నిచ్చి పెండ్లిచేశారు.

కిష్టారావు పార్వతిని ప్రేమించికాదు పెళ్ళాడింది. ఎక్కడా దొరక్క చేసుకొన్నాడు. కిష్టారావు మొదటి భార్య చచ్చిపోయి పది సంవత్సరాలయింది. అప్పటినుండి పార్వతి మీద కళ్లుపెట్టుకున్నారు యింట్లో వారందరూ. కాని ఆమెకు మాత్రం అతనిమీద మనసులేదు. బొద్దుగా, అసహ్యంగా వుంటాడు. కావటానికి ప్లీడరే అయినా అతని తత్వం మానవ మాత్రులు సహించరానిదిగా వుంటుంది. అందులో కాస్తో కూస్తో కాలేజీ జీవితాన్ని రుచిచూచిన పార్వతి సహిస్తుందనటానికి వీల్లేదు.

అక్కర మొదటిరాత్రే లేడిపిల్లలాగా భయపడింది. పార్వతి- సన్నగా, పచ్చగా, నాజూగ్గా దేవతామూర్తిలా వుండే పార్వతి యముడులాంటి కిష్టారావునుచూచి నిజంగా భయపడింది. వీడ్చింది. ఎంతవీడ్చినా అతను దయతలిచాడా? పావం!

పది సంవత్సరాల ఆశలు, కోరికలు ఒక్కసారిగా అతని కళ్లల్లో ప్రతిఫలించినయ్.

పార్వతిపైన కిష్టారావుకు అమితమైన కోపం వచ్చింది. కానీ, ఆ సమయంలో ఏమనటానికీ వీల్లేక వూరుకున్నాడు. ఆడవాళ్ళ గుణమే అంత. మగవాడి యిష్టప్రకారం ప్రవర్తించుకోటం చేతగాదు వీళ్ళకు! తను అంత ప్రేమగా, ఆశగావుంటే పరాయివాణ్ని ఎవణ్నో చూసినట్లుగా చూస్తుందా తనను అనుకున్నాడు. మరునాడు పార్వతి పగలు పన్నెండయినా నిద్ర లేవలేదు. కాఫీ తాగలేదు. ఒళ్ళంతా నొప్పులు. తలనొప్పి, జ్వరం వొచ్చినయ్.

రాత్రి కిష్టారావు అన్న మాటలకు ఆమెకు విరక్తి కలిగింది. యింత అనాగరికుడేం అనుకుంది. ఈ దున్నపోతుకు తన నెందు కిచ్చి చేశారా అని మథనపడింది. "నీ రంకువేషాలు నా దగ్గర వెయ్యకు" అన్నాడు అసహ్యంగా అభము శుభమూ తెలియని తనను పట్టుకొని. "ఇవ్వాళ మొండికేస్తే ముందుగతి ఏమిటో ఆలోచించుకో" అన్నాడు నీచుడు, తుచ్ఛుడు, లుచ్చా అయిన కిష్టారావు. ఇన్ని సంవత్సరాల అనుభవమున్న లాయరు- కిష్టారావు అలా అంటాడా అనుకుంటారు. అంటాడు. అతని అనుభవం, మంచితనం యితర విషయాల్లో. ఈ విషయంలో కుక్కకన్న హీనం.

ఏకంగా పార్వతిని కాపురానికే పంపారు కిష్టారావు కోరికమీద. "మీ అమ్మాయికేం, మహారాణిలా వుంటుం" దన్నాడు. అతనితరపు ముసలమ్మ అంది "చిన్నతనం. అయినా మీన పార్వతి చాలా మంచిది. మేమంతా లేమూ" అన్నది

హోమగుండంలో సమిద్దలా చేయటానికి, అతని కోరికలకు బలి చేయటానికి. ఇంతకీ పార్వతితరఫున మాట్లాడింది, అనుకున్న ది ఎవరూ లేరు. తల్లిమాత్రం అంపకాలప్పుడు కన్నీరు పెట్టుకుంది సాధారణంగా, లాంఛనంగా.

పార్వతి వెళ్ళిన పదిరోజులకల్లా యింటిపనులన్నీ సొంతంగా నిర్వహించుకోవలసి వచ్చింది. యింట్లో పనిమను షులు కాదుగదా, మంచిగా మాట్లాడేవాళ్ళుకూడా లేకపో యారు. అంట్లు తోముకోవటందగ్గరనుండి రాత్రికి పక్కలు పరచేవరకూ క్షణం తీరిక వుండేదిగాదు పార్వతికి. కిష్టారావును ఒకసారి లాలనగా అడిగింది "ఎవరైనా పనిమనిషిని కుదుర్చు కుంటాను. అన్నిపనులు ఒక్కదాన్నే చేసుకోలేకపోతున్నా" నని. "మనమేం లక్షాధికారులం, రాజాధిరాజులం కాదు పని మనుషులకు, పరివారాలకు డబ్బు తగలేసుకోటానికి"అన్నాడు.

"అయితే, రాజాధిరాజులేనా పనివాళ్లను పెట్టుకునేది" అంది. ఆ మాటకు కిష్టారావుకు అమితమైన కోపం వచ్చింది. "నాకే ఎదురుచెపుతావా నువ్వు? అయినా యిద్దరు మనుషు లున్న యింట్లోనే పనిచేయలేని ఆడదానివి నువ్వేం ఆడదానివే" అని చీవాట్లుపెట్టాడు.

ఆమెకు ఆ యింట్లో స్వాతంత్ర్యం లేదు. కేవలము దాసిగా జీవిస్తోంది. అతని అవసరాలకు తన ఆశయాలను కుదిం చుకోవలసివస్తోంది. సినిమాలు, క్లబ్బులు, పత్రికలు– వేటికో నోచుకోలేదు ఆమె. ఆమెకు జీవితం అగ్నిగుండంలాగైంది. అందులో సమిధలా కాలిపోతోంది. తన మొరాలకించేవారు ఎవరూ లేరు పాపం!

అసలే సన్నగా వుండే పార్వతి యింటిపనుల్తో ఎముకల గ్రోవుగా మారిపోయింది. పచ్చగావుండే శరీరం పొయ్యి శగకి నల్లక ప్పేసింది. పుట్టింటివారు పెట్టిన నగలు పెట్టుకున్నా వూరు కోడు కిష్టారావు. సంవత్సరానికి నాలుగు చీరలకన్నా ఎక్కువ కొనడు. అంతకన్నా ఎక్కువ వాడుకోవటం అనవసరం. 'నేను చూడు! రెండుసూట్లు కొంటే ఆరు సంవత్సరాలు వాడుతాను' అంటాడు. అంతా తనలాగానే బ్రతకాలంటాడు. తనదే ఆదర్శ జీవితం అనుకుంటాడు. కాలేజీలో సీతాకోకచిలుకలా తిరిగిన పార్వతికి కిష్టారావుకోడి దాంపత్యం యమలోకంగా, బండి ఖానాగా వుంది.

పార్వతి ఒకసారి తండ్రికి ఉత్తరం వ్రాసింది రమ్మని. తండ్రికి కూతుర్ని చూసి గుండె నీరైపోయింది. ఎలాంటి పిల్ల ఎలా అయిపోయిందా అనుకున్నాడు. కన్నీరు పెట్టుకున్నాడు. అయినసంబంధంగదా, కూతురు సుఖపడుతుంది అనుకున్నాడు గానీ, యింతగా నాశనమైపోతుం దనుకోలేదు. కిష్టారావుని అడిగాడు అమ్మాయిని తీసుకెళ్ళి పదిరోజులుంచుకొని పంపుతా నని. సుతలాం వొప్పుకోలే దతను. పార్వతి ఆశలు ఆడియాశ లయినాయి. చేసిదిలేక వెళ్లిపోయాడు రెండు చీరలు కొనిపెట్టి, ఒక పాతికరూపాయలు చేతిలోపెట్టి.

కిష్టారావుదృష్టిలో పార్వతి ఆదర్శగృహిణి. ఆమెను గురించి అతను చాలా గర్వపడుతూంటాడు లోలోపల, పైకి మాత్రం ఆమె మంచితనాన్ని మాటల్లోకి రానీడు. యితరుల దగ్గర మాత్రం పొగడుతుంటాడు పార్వతి గుణగుణాల్ని గురించి, మంచితనాన్ని గురించీ.

అయిదు సంవత్సరాల అనుభవంతో పార్వతి అతనిపర ప్పెంది. అతని ఆదర్శాలకు అనుగుణంగా ప్రవర్తించగలుగు తోంది. ఆమెకు ఎవరిని గురించిన విచారమూలేదు ప్రస్తుతం. కాలేజీజీవితాన్ని పూర్తిగా మరచిపోయింది. పుట్టింటివారిమీద ఆశలు కోల్పోయింది.

పార్వతినల్ల తనకు పుత్రసంతానం వాంఛించాడు కిష్టా రావు. కానీ, తన కా అదృష్టం కలగలే దింకా. అసలు కలుగు తుందో లేదో అనుమానంకూడా. పార్వతి అంత బలహీనంగా అర్భకురాలుగా వుంది.కిష్టారావు ఆస్తికి యింకా వారసులంటూ లేరు.

కిష్టారావు కోర్టుకెళ్ళిన సమయంలో పార్వతికి ఉత్తరం వచ్చింది కలకత్తానుండి. ఎవరో దాసు, తను వస్తున్నానని ప్రాశాడు. ఆమె హృదయంలో కలకలం బయల్దేరింది. మరచి పోయిన దాసురూపం మళ్ళా ఆమె మనోఫలకంమీద ప్రతి ఫలించింది. గతించిన విషయాలు తిరిగి జ్ఞప్తికొచ్చినయ్. అతను రావటం ఆమెకు సంతోషం, విచారంగూడా. తనకాలేజీ రోజుల్లో తనలో ఆశలు లేపిం దా దాసే.అప్పట్లో అతణ్ణి పెళ్ళి చేసుకుందామనుకుంది. కానీ సిగ్గుచే ఎప్పుడూ తన మనసులోని విషయాన్ని పైకి చెప్పలేకపోయింది. గంటల తరబడి అతనితో మాట్లాడేది. కానీ, అంతకన్నా జరిగిందిలేదు. దాసు తనను ప్రేమించాడు. అయినా అతను బీదవాడు. తన జీవితానికే అస్తుబిస్తుగా గడుస్తున్న దాసు తనను ప్రేమిస్తున్నాను అని చెప్పలేకపోయాడు. నోరు తెరచి అడిగినా అప్పట్లో తను ఒప్పుకునేదీ గాదు.

అప్పటినుండి దాసు ఒంటరిగానే జీవిస్తున్నాడు. ప్రపంచానికి విరుద్ధంగా బ్రతుకుతున్న దాసు అప్పటికీ యిప్పటికీ అంతే. దాసు తలిదండ్రులతో పోట్లాడి వెళ్ళిపోయాడు. బియ్యే చదివిన దాసు గవర్నమెంటు నౌకరీ చేస్తాడని, తమ కుటుంబాన్ని ఉద్ధరిస్తాడని నమ్మకున్న తలిదండ్రులకు అన్యాయంచేసి వెళ్ళిపోయాడు. అప్పటి నుండి యిప్పటి వరకూ ఎలాబ్రతికాడో తెలీదు ఎవరికీ. కానీ, యిప్పుడు తనకు ఉత్తరం వ్రాసి వొస్తున్నాడంటే వెలుగు చీకట్ల మేళవింపు ఆమెకళ్లల్లో తొణికిసలాడింది.

దాసును చూడగానే పార్వతి సంతోషం పట్టపగ్గాలు లేకుండా పోయింది. 'ఇతనేనా దాసు. అబ్బ ఎంత మారిపోయాడు!' అనుకుంది.

'ఏం పార్వతీ! జ్ఞాపకం వున్నానా?' అన్నాడు దాసు.

ఆమె కళ్ళు ఆనందభాష్పసంకలితమైనయ్.

'దాసూ! వొచ్చావా నిజంగా— మళ్ళీ నిన్ను చూస్తానుకోలేదు!—! అంది పార్వతి.

దాసుకు ఆమెతో ఏకాంతంగా మాట్లాడుకునే అవకాశం లభించింది—ఆ కొద్దికాలాన్నే సద్వినియోగం చేసుకుని, ఎంతో చరిత్రను వల్లించాడు. "మరీ అలా చిక్కి పోయావేం పార్వతీ! చదువుకొనే రోజుల్లో ఎంతో అందంగా, కొంటెగా వుండేదానివి. మనిషివి పూర్తిగా మారిపోయావే!" అన్నాడు.

ఆమె తల వొంచుకొని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది సమాధానంగా. "నీ క్లాస్‌మేట్ కమల కలకత్తాలో చాలాసార్లు కలి

సింది. ప్రస్తుతం అక్కడే వుంటోంది. నిన్ను అడిగానని చెప్ప మందికూడా?" అన్నాడు.

"ఏ కమల?"

"మరచి పోయావ్రూ? భలే! అంతస్నేహంగా వుండేవాళ్లు మీరిద్దరూ. ఎలా మరచి పోయావు?"

లేదు దాసూ! నా కా విషయాలేవీ జ్ఞాపకంలేవు. నీవు తప్ప మిగతా కాలేజీ ప్రపంచాన్నే మరచిపోయాను. మరచి పోవలసిన పరిస్థితులు వొచ్చినయ్. ఏంచేసేది?

"ఏం, సుఖంగా వుంటంలేదూ? కిష్టారావు బాగా చూట్టంలేదా?"

"అదంతా ఎందుకు చెప్పూ. ఎలాగో బ్రతుకుతున్నాను."

అలాకాదు పార్వతీ! చెప్పూ—ఏమిటి నీకు కష్టం?" వీపుమీద, కాళ్ళమీద వాతలు చూపించింది. "కిష్టారావు రాక్షస ప్రవర్తన యిలాంటిది. మనిషిని వూరికే అనుమానిస్తాడు. చచ్చేటట్టు కొడతాడు. యిదే లోకం నాకు" అంది.

ఆమెస్థితి దాసు హృదయాన్ని కరిగించివేసింది. కిష్టారావుమీద అంతులేని కోపంపచ్చింది. కానీ ఏంచేస్తాడు? ఏం చేసినా పార్వతి జీవితం నాశనమై పోతుంది. ఆమె మీది ప్రేమ చొప్పున అన్నీ సహించి వూరుకున్నాడు.

కిష్టారావు యింట్లో లేనిసమయంలో దాసు పార్వతి మంచి చెడ్డలు కనుక్కోటానికి వొస్తుండేవాడు. ఆమెస్థితి రోజురోజుకీ దారుణంగా మారిపోతోంది. మరీ రోగిష్టిగా మారిపోయింది. ఎక్కువ కాలం బ్రతికే ఆశలుకూడా లేవు...

అదీ డాక్టర్లు చెప్పింది. అయినా యింట్లో నానా వెట్టిచాకిరీ చెయ్యక తప్పటంలేదు ఆమెకు.

పార్వతి ఆరోగ్యాన్ని గురించే ఆలోచించుకుంటూ తన గదిలో కూర్చుని వున్నాడు దాసు. అతనికి ఆమె గురించిన బాధ ఎక్కువ. ఆమె ఆరోగ్యాన్ని గురించిన విచారణ. ఆమె వున్న నరకం ఎలా స్వర్గంగా మార్చగలుగుతానా అని ఆలోచన. ఎవరో తలుపుతట్టిన చప్పుడైంది. "ఎవరు?"

అంటూనే వెళ్లి తలుపు తెరిచాడు. లోపలి లైటువెలుతురు పార్వతిమీద పడింది.

"పార్వతీ!" అన్నాడు ఆమెను ఒడిసిపట్టుకుంటూ.

"దాసు!" అని అతని చేతుల్లో వాలిపోయింది. చేతి నిండా నెత్తురయింది. దాసు చొక్కాకు నెత్తురు!

"ఏమిటి పార్వతీ! ఏంజరిగింది. చెప్పు? ఆ రాక్షసుడు ఏంచేశాడు? ఇంతకాలం చేసిన సజీవహత్య చాలక ఈ దారుణానికి పూనుకున్నాడా? చెప్పు పార్వతీ!" అంటూ విలపించసాగాడు దాసు.

వారి నేమీ అనకు దాసూ! తప్పంతా నాది. నేను దోషిని."

"ఏమిటి పార్వతీ—ఏం జరిగింది చెప్పు. ఎందు కిలా క్షోభ పెడతావు నన్ను?"

"మీ పవిత్రమయిన చెవులతో వింటారా ఆ పాడు మాటలు! ఏ కల్మషమూ లేని మీకు ఎలా చెప్పేది. వొద్దు, వొద్దు. అబ్బా...వొద్దు"

"పార్వతీ!"

"ఆయనకు ఎవరో చెప్పారట. మీరు నాకోసం...అబ్బ ఎలా చెప్పేది..." ఏడుస్తుంది చేతుల్లో మొఖం పెట్టుకొని.

"చెప్పవమ్మా పార్వతీ—మా తల్లిగాదూ చెప్పు"

"మీరు నాకోసం ఆయన లేనప్పుడు వొస్తున్నారని ఎవరో చెప్పారట. మీకూ నాకూ సంబంధం కల్పించి, కొట్టి, రక్కి, ఇనపకుర్చీ తీసుకొని కొట్టాడు. "వాడిదగ్గరకే పో, నీ రతికు మొగుడు దగ్గరకే పో...నా వాకిలి తొక్కకు. నా ప్రతిష్టకు భంగం రానీకు. పో, చావు వాడితోనే" అని నెట్టాడు బైటకు. ఎంత ఏడ్చినా తలుపు తీశేడుకాదు.ఏంచేసేదిదాసూ!"

"వూరుకో పార్వతీ! నే నున్నానుగా. మూర్ఖుడు! ఎందుకూ, చదివాడు! లేనిపోని నిందల్ని వేయటానికా? పవిత్ర మైన స్నేహానికి, రంకుతనానికి తేడా తెలుసుకోలేని గుడ్డివాడు. పోనీ పార్వతీ, నీకేం భయంలేదులే."

ఆమె తల గాయాలను అన్నిటినీ నీళ్ళలో కడిగి కొబ్బరినూనె రాశాడు ఓపిగ్గా. విసనకర్రతో విసురుతూ నిద్ర పుచ్చాడు. ఆ రాత్రి పార్వతి అనేకసార్లు కలవరించింది. పాడు కలలెన్నో కన్నది. భయపడింది. కానీ, మధ్యమధ్య దాసు ఓదారుస్తూనే వున్నాడు. ఆమెమీద వేయికళ్ళు పెట్టుకొని చూసుకుంటున్నాడు పాపం దాసు!

దాసు జీవితం విచిత్రమైనది.అతను ఎక్కడకు పోతాడో ఏం చేస్తాడో తెలీదు. రాత్రిళ్ళు యింట్లో వుండడు. ఎప్పుడూ తిరుగుతుంటాడు. ఒక వూరు, ఒక పల్లెగాదు. రోజుకు ఎన్ని వూళ్ళు తిరుగుతాడో లెక్కలేదు. తెల్లవారేసరికి ఇంటి కొస్తాడు. మళ్లీ చీకటి పడంది బైటకు కదలడు. యింట్లోకి

కావలసినప్పుడు ఎక్కడో పది గూపాయలు తీసుకొస్తాడు. కానీ, పార్వతి వొచ్చిన దగ్గరనుండి అతని పరిస్థితి మారిపోయింది. వెనుకటిలాగా పుస్తకాలు చదవలేక పోతున్నాడు. డబ్బు రావటంలేదు. రోజూ జీవితంలో పార్వతికి సహాయంగా వుంటాడు. తనే వంటచేస్తాడు. యింటిపనులు చేస్తాడు. విచిత్రమయిన వ్యక్తి—కాదు—ఆదర్శవ్యక్తి!

పార్వతికి అతని ప్రవర్తన నచ్చిందికాదు. అతనొక్కడే కష్టపడి పనిచేసేవాడు. తన ఆరోగ్యము పాడవుతుందని ఒక్కపనీ ముట్టుకోనీడు. పగలంతా యింట్లోపని. రాత్రి బయట తిరుగుడు. క్షణం తీరిక, దమ్మిడీ ఆదా లేని వుద్యోగం.

"నాకోసం మరింత కష్టపడటం న్యాయంకాదు దాసూ" అంది.

నిజం! మీవాళ్ళందర్ని వొదిలి నన్ను నమ్ముకొని వొచ్చినందుకు సుఖపెట్ట వలసిన కనీసధర్మం అది. తల్లి, తండ్రి, అన్నలు, చెల్లెలు, స్నేహితులు, ఉన్నఊరు అన్నీ వొదిలి చేసుకున్న మొగుడిని నమ్ముకొనివచ్చే భార్యల్ని ఎంతో గౌరవంగా, పూజ్యంగా చూడవలసినదిపోయి, రాక్షసుల్లాగా, కీచకుల్లాగా ప్రవర్తించే భర్తను కాదుగదా, స్నేహితుణ్ణి. ఆ మాత్రం సుఖం స్నేహితుని దగ్గర కాక పోతే యింకెక్కడ లభిస్తుంది పార్వతీ! పిచ్చిదానా!" అనేవాడు దాసు.

పార్వతికి రోగం తిరగబెట్టింది. దాసుగుండెల్లో పెసావర్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణం. ఏంచేస్తాడు? చేతిలో డబ్బులేదు. డబ్బువచ్చే సదుపాయం కూడాలేదు. కానీ తనను నమ్ముకున్న

పార్వతి!— ఏంచేయాలి? చేతికి వున్న ఉంగరం యిచ్చింది అమ్మి డబ్బు తెమ్మని.

డాక్టరు పార్వతికి తీవ్రంగా చికిత్స చేస్తున్నాడు. దాసు ఆత్రంగా పరుగెత్తుకొచ్చాడు. "డాక్టర్! మీరు ఆ గదిలోకి పోండి. వక్ర-మాట మాట్లాడాలి, రహస్యం.' అని పంపేశాడు. ఏమిటి దాసూ?" అంది పార్వతి

'ఇవిగో పార్వతీ రూపాయలు! పోలీసు లొస్తున్నారు, నేను వెళ్ళాలి. డాక్టరుతో చెప్పు. నయమవుతుంది."

అంతలోకి పోలీసులొచ్చి దాసు చేతులకు బేడీలు వేశారు.

"అది నా వుంగరం. దొంగ వుంగరం కాదు.' అన్నది పార్వతి.

"కావచ్చు. కానీ, అది కాదునేరం. కలకత్తానుండి పారి పోయి వచ్చిన కమ్యూనిస్టు ఈ దాసు" అన్నాడు పోలీసు అధి కారి కర్కశంగా.

౫౨

పరిష్కారం

ఒక వ్యక్తి సంస్కారం ఎప్పుడూ పుటకలతో రాదు. పూర్వజన్మ సంస్కారం అంటాం కాని, లోతుగా ఆలోచిస్తే ఆ సంస్కారం నిజం కాదేమో ననిపిస్తుంది. సమాజంకూడా వ్యక్తి సంస్కారాన్ని నిర్ణయించలేదు. వాతావరణం అంత కన్నా కాదు. వ్యక్తి విద్యాబుద్ధులే నిర్ణయించగలవు అతని సంస్కారాన్ని. అయినా ఈనాటి మానవుడి సంస్కారం ఎంతలో వుందంటే పాతను విసర్జించనూలేడు, కొత్తను స్వీకరించనూలేడు. భగవదారాధన పూజ్యం కాదంటాడు. అని పూర్తిగా వొదిలిపెట్టనూ లేడు. అలాగే రెండింటి సంకుల సమరంలో నలిగి, జీవితాలను నాశనం చేసుకుని దౌర్భాగ్యదామోదరుడుగా తయారవుతాడు. ఒక్కొక్కసారి ప్రాణాలకే మోసం తెచ్చుకుంటాడుకూడా.

♦ ♦ ♦

వెంకటసుబ్బయ్యది మా వూరే. ఏదో పదెకరాల పొలం వుంది. ఒక పెద్ద పెంకుటిభవంతి వుంది. కాని అతనొక ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలవాడు. సమాజం అతన్ని గౌరవిస్తుంది. అంటే అతని సంస్కారం ఈనాటి సమాజం గౌరవించేదిగా వుంటుంది.

వెంకటసుబ్బయ్య పెద్దగా చదువుకోలేదనేగాని, చదువుకున్నవారికంటె ఎక్కువ తెలివితేటలే వున్నాయి. ఎలాంటి

వారినైనా తన వాక్చాతుర్యంవల్ల యిట్టే ఆకర్షించగలడు. మహామేధావి అని చెప్పడానికి వీలులేదు గానీ, బొత్తిగా బుద్ధి తక్కువ వెధవ అనటానికీ వీల్లేదు. ప్రతికా విజ్ఞానం అతనిలో చాలా వుంది. అలాంటి రాజకీయ విజ్ఞానంకూడ ఎక్కువగానే వుంది.అయితే ఆ వున్నది సంపూర్ణం కాకపోవచ్చు.సామాన్య పల్లెటూరి ప్రజల్లో పెద్ద అనిపించుకోటానికీ, వారిమీద అజమాయిషీ చేయటానికి, మంచికీ, చెడ్డకీ తనసలహాలకై వారిని రప్పించుకునేందుకు సరిపోతుంది. నాగరికతా ప్రపంచంలో అభ్యుదయ సంస్కారము లో పెరిగిన వారి దృష్టిలో వెంకట సుబ్బయ్య నాగరికతా సంస్కృతులుగానీ, రాజకీయ పరిజ్ఞానముగానీ అల్పం. చెప్పుకోదగ్గదిగాకూడా వుండవచ్చు.

మా వూళ్ళో వేదో కొంచెం అక్షరజ్ఞానం కలిగి ఉద్యమాల్లోతిరిగి, కాస్త వ్యక్తిగా జీవించగలిగినవాడు, జీవిస్తున్న వాడు వెంకటసుబ్బయ్యే గనక కొంచెం సంస్కారం గల కుటుంబమ్లోని పిల్లను చేసుకోవాలనుకున్నాడు. గట్టి ప్రయత్నమే చేశాడు. అతనిశ్రమకు ఫలితంగా తులశమ్మ దొరికింది.

తులశమ్మ కేవలం బస్తీపిల్ల కాకపోయినా, బస్తీనాసన ఆమెలో జాస్తిగావుంది. అందంగా వుంటుంది. అయితే కొందరికి అందంగా వుండకనూపోవచ్చు. మొత్తానికి తులశమ్మ ఎర్రగా, సన్నగా, నాజూగ్గా వుండేది- పల్చటిపెదాలు. ఆ పెదాలు చూస్తేనే ముద్దొచ్చేవి. అంత అందమయిన పెళ్ళాం దొరికినందుకు వెంకటసుబ్బయ్య నిజంగా గర్వించాల్సిన విషయం. వెంకట సుబ్బయ్య మాటేమోగాని, అంత అందమైన

అమ్మాయినిచూసి మావూరి యువకులంతా గర్వపడేవాళ్ళం. ఆ వెంకటసుబ్బయ్యకు పట్టిన అదృష్టమే మాకు పడితే (?) ఇంతకో వొచ్చిన చిక్కేమిటంటే వెంకటసుబ్బయ్య తనది అదృష్టమని అనుకోడు; అనుకొనేటంత సంస్కారం ఆయనలో లేదు. సరదాగా అందరి మొగుళ్ళలాగానే తనూ ఒక మొగుడుగా ఉంటాడు పాపం! ఇంతకీ అతని బాధేమిటంటే తనలాంటి పలుకు బడిగలవాడు ఆడదాని దగ్గరకొచ్చి 'నువ్వు చాలా అందమైన దానివి' అని అంటాడా? అంటే తనకు, తనపదవికి ఎంత నామోషి! అట్లా అంటే తన పెళ్ళాం ఎంతగర్వపడుతుంది. ఇవాళ అది గర్వపడితే పొంగిపోయి రేపు యింకా తనమాట వింటుందా? తనను లెక్కచేస్తుందా? తనకెంత నామర్దా! రంభలా రొమ్ములివిచుకు తిరగదూ? ఎందుకొచ్చిన తద్దినం కొని నెత్తిన పెట్టుకోవటం? అనుకున్నాడు వెంకటసుబ్బయ్య. పెండ్లికాబోయే భామ తులశమ్మ మొగుణ్ణి గురించి ఎంతగానో అనుకుంది. తన కాబోయే భర్త చదువుకున్నవాడనీ, తెలివిగలవాడనీ, మంచి పేరుగలవాడనీ విని పొంగిపోయింది. నిజానికి సహజమే. ఏ ఆడదైనా తనభర్తకు యింకాపేం ఎక్కువ కావాలని ఆశిస్తుందిగనక? అందరు ఆడంగులకు మల్లేనే తులశమ్మా ఆశించింది. తనాశించినవి తనకు కాబోయే భర్తలోవున్నాయని విని సంతోషించింది.

కాని అత్తవారింటికొచ్చాక అసలు బండారం బయట పడింది. తులశమ్మను అదుపాజ్ఞల్లో పెట్టడానికి వెనకఎత్తిన అత్తసూత్రాలు లేవు. మామగారుఏనాడో చచ్చిపోయాడు. అత్తగారు ఎందుకు పుట్టింటికి వెళ్ళిపోయిందో ఎవరినడిగినా

చెప్పరు. వెంకట సుబ్బయ్యను చూసి అతనిలోని లోపా లను బయట పెట్టరు ఎవరున్నా. కాని తులశమ్మ పాలేరునడిగి తెలుసుకుంది. పాపం! తెలుసుకొని అత్తగారిమీద సానుభూతి చూపి రెండువేడి కన్నీటిబొట్లు విడిచింది కూడా. వెంకట సుబ్బయ్య తల్లిని ఎప్పుడూ కొట్టేవాడట. రహస్యంగా రంపాన బెట్టి రాచేవాడట. నానా యాతనా పెట్టేవాడట. కొడుకుచేత నానా మాటలూ పడలేక, ప్రాణాలకు తెగించి పుట్టింటికి వెళ్ళి పోయిందట. యింత పేరు ప్రఖ్యాతులతో బ్రతుకుతున్న వెంకట సుబ్బయ్య తల్లిని తిడతాడా, కొడతాడా, యింట్లోంచి వెళ్ళి పోతే వుదాసీనంగా వూరుకున్నాడా అంటే వూరుకున్నాడు. అతని మనస్తత్వం ఎలాంటిదో ఎవరమూ చెప్పలేం. అతను అలా హింసించిన మాట మాత్రం వాస్తవం.

అత్త యింట్లోంచి వెళ్లిపోవటానికి కారణం అనుభవ పూర్వకముగా తెలుసుకుంది. కాపరాని కొచ్చిన ఏడాదికల్లా తులశమ్మ తెలుసుకుని భర్తను చీదరించుకుంది. అతని ప్రవర్త నకు అసహ్యించుకొంది.

పైకి మెరమెచ్చులుగా కనిపించే వెంకటసుబ్బయ్య సం స్కారం చాలా నీచాతి నీచమైంది. అతని ప్రవర్తనే చాలా అసహ్యకరం. తులశమ్మ ఏవిధంగానూ అతణ్ని మెచ్చుకోలేక పోయింది. సంవత్సరం తిరిగేటప్పటికి భార్యదృష్టిలో అంత నీచుడుగా చూడబడటం ఆశ్చర్యం.

వెంకటసుబ్బయ్య భార్యను, అదుపాజ్ఞలో పెట్టేందుకు ప్రయత్నించటం సాగించాడు. చీటికీ మాటికీ, అవసరంవున్నా లేకపోయినా కల్పించుకుని ఆమెలో తప్పులు చూపెట్టసాగిం

చాడు. ఈ ప్రవర్తనకు, పరివర్తనకు తులశమ్మ ఆశ్చర్యపోయింది మొదట తాను పెద్ద బొట్టు పెట్టుకోలేదని ఒకసారి తనమీద పోట్లాడినసంగతి ఆమె మరచి పోలేదు యింకా. అప్పుడే మళ్లా సాగించాడు. "ఆడవాళ్ళు పత్రికలు చదవటం దేనికి? పుస్తకాలు చదవడం దేనికి? శుభ్రంగా యింట్లో పనిచేసుకోక" అని ఆడంగి కేకుల కబుర్లన్నీ పోగుచేసి భార్య మొహాన వూదటం ప్రారంభించాడు.

ఒకసారి మా వూరిలో గాంధీ జయంతినాడు జరిగిన మహాసభలో వెంకటసుబ్బయ్య స్వయంగా, కాగితంమీద వ్రాసుకొచ్చి ఉపన్యసించాడు. గాంధీజీ ఆశయాల్లో స్త్రీస్వాతంత్ర్యమనీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని అనుభవించాలంటే విద్యాబుద్ధులు ఉండాలనీ. అవి చదువువల్లగాని లభ్యంగావనీ గంభీరోపన్యాసం జేశాడు.

ఆనాటి మహోపన్యాసానికి అతను పొందిన ప్రశంసలు అనంతం. అతని ఖర్మంకాలి తులశమ్మ ఆనాడు అతని వుపన్యాసం విన్నది. భర్త తనతో పోట్లాట్టం చూసి "మీ రేగదండి అనాడు ఆడవాళ్లంతా చదువు కోవాలన్నారు!" అన్నది.

"ఏనాడు?" అన్నాడు వెంకటసుబ్బయ్య

"గాంధీ జయంతినాడు"

"ఓ! అదా!" ఒక్కసారి ఫక్కుననవ్వి "అది అందరి కోసం చెప్పిందిగాని, నీకోసంగాదు. అయినా అది గాంధీగారి ఆశయమని చెప్పానుగాని నా ఆశయమని చెప్పలేదే" అన్నాడు.

అతని తెలివితేటలకి ఏడవాలో నవ్వాలో అర్థంగాలేదు తులశమ్మకు.

కానీ, యిలాంటి గిల్లికజ్జాలు రోజు రోజుకు యిద్దరి మధ్యా విపరీతంగా పెరిగిపోతున్నాయ్.

పాపం! అందుకు తులశమ్మను అనవలసినపని లేదు. పనీపాటా లేని వెంకటసుబ్బయ్య కాలక్షేపంకోసం పెళ్ళాంతో పోట్లాటపెట్టుకునేవాడు. అతని వుద్దేశం ఏమిటంటే: "వున్నా, లేకపోయినా లోపాలను వున్నట్లుగా చూపిస్తే, నిజంగా ఆ లోపాలు తనలో వున్నాయనుకొని భార్య తులశమ్మ అణగి మణగి వుంటుం" దని అతని భావన. కానీ, అలా జరుగుతుందో, దాని పరిణామం యింకా ఎలాగైనా మారటానికి అవకాశం వుందేమో వెంకటసుబ్బయ్య వూహించుకోలేదు.

కాని, తులశమ్మ జీవితం దుర్భరం అనుకుంది. వెంకటసుబ్బయ్యతో కాపురం చేయటం కష్టం. కొత్తచీర కట్టుకోటానికి వీల్లేదు. తల దువ్వుకోటానికి వీల్లేదు. అందంగా అలంకరించుకుంటే "కాపురం చేసుకునేదానికి నీ కెందుకే అలంకారాలు, అందాలు? తీసెయ్యి" అని దగ్గరుండి తీయించేవాడు.

వెంకటసుబ్బయ్యలో మరో దుర్గుణం ఏమిటంటే "నే కోరని అలంకారం, అందం నీ కెందుకు? నీ అందమంతా నా కోసమేగదా, భర్తను తృప్తిచెందించటమేగదా పతివ్రత లక్షణం. నా కిష్టంలేని అలంకారాలు నీ కెందుకు? అలా నా కంగీకారం లేని ఆభరణాలతో నన్నేం తృప్తిపరుస్తావు? కానప్పుడు నువ్వేం పతివ్రతవు? అనేవాడు.

ఇంటికి భార్యతో మాట్లాట్టానికి ఏ ఆడవారినీ రానిచ్చేవాడు కాడు. ఎొస్తే, తన భార్య ఎక్కడ చెడిపోతుందో;

వాళ్లలా యిళ్ల వెంట తిరుగుతుండేమో, తన పరువుప్రతిష్టలు నష్టమైపోతాయేమోనన్నే బాధ అతనిది.

ఈమధ్య అర్ధరాత్రిళ్ళు మరోవిధమయిన పోరాటం సాగించాడు. రాత్రిళ్లు నిద్రపోనీడు, తానుపోడు. "ఆ కమత గాడు నీతో ఏమిటి మాట్లాడుతున్నాడు? ఏమిటి వాడితో నవ్వుతూ మాట్లాడుతున్నావు? వాడికీ నీకూ ఏమిటిసంబంధం?" అని చావగొట్టి నానా హింసలూ పెట్టి సాగాడు.

కానీ, ఈ విషయాలు బయటవారి కెవరికీ తెలియవు. ఎవరికీ తెలియనీడు. కాని లోపల్లోపల ఆమెను చేసే హింస రెండోకంటివాడికి తెలియదు.

ఒకనాడు తెల్లవారేసరికి నీలాటిరేవులో గుసగుసలు ప్రారంభమయినయ్యి. జనం గుమిగూడారు. వూళ్లోంచి జనం విరగబడి వొచ్చి చూస్తున్నారు. 'వెంకటసుబ్బయ్యభార్య తుల శమ్మ ఉరిబోసుకు చచ్చిపోయింది' యిదే ఎవరినోటవిన్నా.

పాపం! ఆమె దురదృష్టానికి విచారించారు వెంకట సుబ్బయ్య తత్వం తెలిసిన కొద్దిమంది. వెంకటసుబ్బయ్య భార్య పతివ్రతయని చెప్పుకున్నారు. కొందరు కౌడీమూకకూడ అనుకోకపోలేదు నాసా తిరుగుళ్ళు తిరగటానికి వీల్లేక వుది బోసుకు చచ్చిం దని. ఎవ రెన్నిమాట లనుకున్నా వెంకట సుబ్బయ్య చెవినిబడలేదు. ఒకవేళ విన్నా వినన్నట్లుగా నటించే వాడు వెంకటసుబ్బయ్య.

తన కేమీ తెలవనట్లుగా వెంకటసుబ్బయ్య తులశమ్మ మరణానికి దుఃఖించాడు. కాని, ఆతని కన్నీటిబొట్లు తులశమ్మ హృదయాన్ని ఏనాడూ శాంతింపచెయ్యలేవు.

౧౦

అవ్యక్తత

సముద్రం మారుమూలల్లోంచి వస్తూన్న అలజడి,అంచు ల్లేని అంచులకు తగిలి చేసే తరంగాల ధ్వనులు, గాలిలో దూరంగా ప్రతిధ్వనిస్తున్నయ్. పశ్చిమాకాశంలో చంద్రుడు సాంద్రంగా అస్తమిస్తున్నాడు. బీచిలో పల్చగా జనం...

ఏకాంతంగా కూర్చుని ఆలోచిస్తున్న సుదర్శనం నడుం వాల్చాడు ఆ యిసుకమైదానంమీద. అలాగే మరి కొంతసేప టికి కన్ను మూశాడు...జీవితంలోని రసవత్తర ఘట్టాల్ని స్పృహకు తెచ్చుకుంటూ బాధల్ని, గాధల్ని తలపోస్తూ...

చుట్టూ అలజడి—యిద్దరు ముగ్గురు వ్యక్తులు...రాత్రి పదిగంటల ఆమవసచీకటి. సుదర్శనం మత్తుగా కళ్ళు తెరి చాడు—తెరవాలని అనుకున్నాడు, ప్రయత్నించాడు. కాని, తెరవలేకపోయాడు. ఎవరో బలంగా అతని తలను, చేతుల్ని అదిమి పట్టుకున్న జ్ఞాపకం. కాని తెలివిలేదు. ఎవరో తెలీ దతనికి.

కళ్ళు తెరచి చూచాడు. చుట్టూ చీకటి. అఖండమైన సముద్రపు హోరు. సముద్రంపైన నల్లని చీకటి కప్పూ. ప్రభం జన ప్రకంపనానికి రేగే జుట్టు;...అలజడి, అలలు, భావాల బాటలు వంకరటింకర్లుగా, చిందరవందరగా. అతనికి జ్ఞాపకం లేదు ఏంజరిగిందో; ఏంజరుగుతూందో స్ఫురణలేదు. అలాగే మత్తుగా, బాధగా కళ్ళుమూశాడు మళ్ళీ.

మైకమా? మరణమా? మూర్ఛా?

మె త్తని చల్లనిచేయి అతనినుదుటిమీద—అలా ఎంత సేపుగా ఆ చేయి సేవచేస్తోందో అర్ధరాత్రి చీకటిలో అలా ఒంటరిగా పడివున్న అతనికి!...సుదర్శనానికి క్రొద్దిక్రొద్దిగా తెలివొస్తూంది.

సగం మూసుకున్న అతని చూపులకు ఎదురుగా ఒక మూర్తి. ఎవ రామె? ఏంచేస్తోంది తనకు! ఇందాకా తనను కొట్టింది, బాధించింది ఆమేనా? అయితే ఇప్పుడు చేస్తోన్న దేమిటి? ఇంకా బాధిస్తోందా - అతని మనస్సుచుట్టూ గందరగోళంగా ప్రశ్నలు.

ఆమెకంఠం శ్రావ్యంగా వినిపించింది అతనిచెవులకు. అందులో కరకుదనంగానీ బాధాహృదయంగాని ద్యోతం కావటం లేదు. ఎవరు? — అందామనుకున్నాడు. కాని నోట మాట పెగలలేదు. అలాగే ఆలోచనలో కళ్ళుమూసుకున్నాడు.

'ఎలావుంది?' ఆమె కంఠంలోంచి మధురధ్వని.

కళ్లు తెరిచి చూచాడు. ఆమె తెల్లనికళ్ళు మెరుస్తున్నాయ్.

"ఊఁ!" అని మూలిగాడు.

"రండి...లేవండి వెళదాం..."

'ఎక్కడికి?" అందామనుకున్నాడు.

'ఇక్కడే మా యిల్లు. దగ్గరలోనే...పది అడుగులు- ఎలాగో ఓపిక తెచ్చుకొని పదండి, నేను పట్టుకుంటాను'

కాదనలేక పోయాడు సుదర్శనం. కాదనేందుకు అవకాశంకూడాలేదు. అసలు ఆ సమయంలో, ఆ ఆపత్సమయంలో

తనమంచిని, శ్రేయస్సును అభిలషించే దెవరు?... ఎవరూ, ఏ ఆదరువూ లేని నిర్జనారణ్యంలో ఉన్న తనకు, ఆ ఎడారిలాంటి సముద్రతీరంలో...

ఆమె సహాయంతో అడుగులో అడుగు వేసుకుంటూ... ఆలోచిస్తో,... నడుస్తున్నాడు ఆమె చూపే దోవన... ఏ మహాప్రస్థానంలోకో, ఏ ప్రపంచంలోకో!

అది చిన్న గుడిసె. తాటాకులయిల్లు. ఇంట్లో మినుకు మినుకు మంటూన్న గుడ్డిదీపం.

కొబ్బరితాళ్ళతో అల్లిన మంచం. దానిపైన గోనె పట్టాల పక్క. అతణ్ణి దానిమీద పడుకోబెట్టింది ఆమె. వేడి వేడి పాలు అతనికి ఆపూట ఆహారం. ఎక్కువగా మాట్లాడ లేక పోయాడు... ఒంటరిగా ఉన్న స్త్రీతో ఆరాత్రికి అలాగే గడిపాడు ఆలోచనలమధ్య తేలే తెప్పలాగా!

ఉదయం కొంచెం స్వస్థత చేకూరింది. బయట ప్రపంచాన్ని చూచాడు. అంతా అయోమయం. తనకు పరిచయమైన ప్రదేశంకాదు. తాను పడుకొనిఉన్న, దెబ్బతిన్న ప్రదేశంగాదు. రాత్రి తను నడిచింది ఓ వంద గజాలకన్న ఎక్కువ ఉండదు. కాని వందగజాలు కాదు, రెండుమైళ్ళు నడచినా ఆ ప్రదేశం కొత్తగానే ఉంది.

ఆమెనడిగాడు సుదర్శనం."నే నిక్కడికి ఎట్లా వొచ్చా" నని.

'నాకుమాత్రం ఏం తెలుసు చెప్పండి. రాత్రి అటు పోయి వస్తూంటే దోవలో తెల్లగావుంటే మొదట చీకట్లో భయపడ్డాను...ఏ తెల్లదెయ్యమోనని. కాని ధైర్యంతోదగ్గర

కొచ్చాను. మీరు! మీరు ఎవరైంది నాకు తెలవదు. కాని, ఆ స్థితిలో చూడంగానే ఏదో ప్రమాదంలో ఉన్నారని స్ఫురించింది. తప్పేదిలేదు. ఈ ప్రాంతాల నేను గాక మరెవరూ కాపరం ఉండటంలేదు. ఆపత్సమయంలో సహాయంచేయటం మానవుని కనీసధర్మంగదాండి !

'అవునులేండి...అయినా మీరిలా ఒంటరిగా...' అనుమానాన్ని వెల్లడించాడు సుదర్శనం.

'అదంతా పెద్దగాథ. చెప్పితే తీరేదిగాదు. నేను జీవితంలో పడ్డకష్టాలు, వెధవ కుళ్ళుప్రపంచంతో పోరాడి, అలసిపోయి, నిర్జనాన్ని, ఏకాంతాన్ని కోరుకున్నాను. జీవితంలో అనుభవించవలసిన సుఖాలన్నీ ఎప్పుడో అనుభవించాను. పుణ్యపాపాల ప్రసక్తే లేదు నా కిప్పుడు.నాకున్న ఆస్తికొద్ది. ఈ కొండలలో ఉంటూ ఈ చిన్నఅడవిలో తిరుగుతూ భూమ్మీదవున్న నాలుగురోజులు ప్రశాంతంగా గడుపుదామనుకున్నాను. అంతే.'

'ఇంతకూ పేరు చెప్పారుగారు'

"పేరు...ఒక పేరేమిటి. అసలు పేరు లేకపోతే ఏం... ఏం, పేరు చెప్పకపోతే—పోనీ 'మానవి' అనండి అంత అవసరమైతే."

ఇంక ఆమెతో ఏమాట్లాడుతాడు మానవమాత్రుడైన సుదర్శనం! ఆమె పెద్ద వేదాంతిలాగా, మహర్షిలాగా మాటాడుతోంటే.

సుదర్శనం జీవితం హాయిగా వుంది ఆమెతో. పదహేను రోజులు అలాగే జరిగింది. ఒకరోజు 'మానవి' చెప్పింది:

"ఓ చిన్నపని చేయాలి మీరు."

"తప్పకుండా చేస్తాను. అంతకన్నానా!" అన్నాడు సుదర్శనం.

ఆమె చెప్పింది. "మీరు పట్టణం పోయిరావాలి!"

"పట్టణం! ఎక్కడుంది పట్టణం?"

"అంత ఖంగారుపడతారేం? చెపుతున్నాగా! మూడు మైళ్ళు పోవాలి. అక్కడికి పోయి మార్వాడీదగ్గర కొద్దిగా బంగారం మార్చుకురావాలి. కొన్ని సరుకులుకూడా తీసుకురావాలి. అయిపోయినాయ్. అసలు ఎప్పుడూ నేనే పోయేదాన్ని కాని, బద్ధకంగా వుంది. ఏమీ అనుకోరుగదా, పని చెప్పానని!"

'ఎబ్బే! అనేందుకేముంది యిందులో! ఫరవాలేదు," అన్నాడు సుదర్శనం.

ఓ చిన్న 'నెక్‌లెస్' తీసి యిచ్చింది. "ఇది నాదికాదు, మా అమ్మది. నా పెళ్లికి పెట్టింది. ఎంతో గారాబంగా పెంచుకునేది. కానీ, అన్నీ గతించినయ్ యిప్పుడు" అంటూ ఏడుపు మొహం పెట్టింది.

ఆమె తల్లి చచ్చిందికామాలున్ను ఏడుస్తోంది అనుకున్నాడు సుదర్శనం. "పోనీలే, ఎంతకాలం బ్రతుకుతారు?" అని ఓదార్చాడు.

సుదర్శనం పట్టణంలో అలా అవుతుందని అనుకోలేదు పాపం! మార్వాడీదగ్గరకు 'మానవి' చెప్పినట్లు ఎకాయెకీని వెళ్ళాడు. వస్తువు చూపించి డబ్బివ్వమన్నాడు.

"ఎక్కడిదయ్యా ఇది నీకూ?" అన్నాడు మార్వాడీ.

"ఎక్కడిదేమిటి—నాదే. డబ్బు అవుసరం. తొరగా డబ్బివ్వు!"

"కొంచెంసేపు కూర్చో వస్తాను" అని చెప్పి ఎవరి చెవిలోనో ఏదో చెప్పి పంపాడు మార్వాడి.

పది నిముషాల్లో పోలీసులు, ఇన్‌స్పెక్టరు వచ్చారు. సుదర్శనం గుండె కొట్టుకోసాగింది.

"ఎవరు, ఇతనేనా? అన్నాడు ఇన్‌స్పెక్టరు సుదర్శనాన్ని చూపిస్తూ మార్వాడీతో.

"ఏమిటి?" అన్నాడు సుదర్శనం.

"ఎక్కడి దీ నగ నీకు?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"నాదే" తడుముకోకుండా చెప్పాడు.

"ఊఁ! నీదేనన్నమాట! ఇది దొంగసొమ్ము. గుంటూరులో షావుకారు రిపోర్టుచేసిన సొమ్ములో యిది ఒక నగ. ఇది నీదికాదని రుజువవుతూంది. ఎందువల్లంటే ఆ షావుకారు గుర వయ్య పే రిదిగో, పైగా నీదని దబాయిస్తున్నావేం దొంగ వెధవా! నడు స్టేషనుకు!"

వెంటనే పోలీసులు అతని చేతులకు బేడీలు వేశారు. స్టేషనుకు నడిపించారు.

సుదర్శనంకు అంతా కలలాగా వుంది. 'మానవి' మోసం చేసిందని అనుకోటంలేదు. తన దురదృష్టమేనని తలపోస్తున్నాడు.

జైల్లో కూర్చున్న సుదర్శనంకు ఏదో ఒకటి తక్కువగా అన్ని అవస్థలూ వస్తున్నయ్. రిహార్సల్లో నటునివలె అతని మఖంచూపని భావం లేదు.

సుదర్శనానికి జైల్లో మరి నలుగురు స్నేహితులు పోగయ్యారు. అందరూ చదువుకున్న వాళ్ళు, వివేకవంతులు. వాళ్ళు జైల్లోకి ఎందుకొచ్చారో, ఎలా వచ్చారో నని సుదర్శనానికి అనుమానం. అడిగాడు తెగించి.

వారు చెప్పింది నిజమే! అందరూ 'మానవి' మాటల్లో మోసపోయినవాళ్ళే. అందరికీ ఒకేరకం అవస్థలు. బీచిలో ఉండగా ఎవరో కొట్టటం. 'మానవి' తీసుకుపోవటం, ఎక్కడో పడెయ్యటం, చివరకు సుశీల, కమల, సుగుణ, మానవి అనే పేరులు గల స్త్రీ వాళ్ళని రక్షించటం, ఈవిధంగా జైలుకుపంపటం.

"అయితే ఆ మనిషిని పట్టుకోగూడదూ పోలీసు?" అని అడిగాడు సుదర్శనం.

"నిజమే పట్టుకోవచ్చు; కాని, ఆ మనిషి దొంగలగుంపులోది. ఆసొమ్మంతా చౌకగా కొంటాడు మార్వాడి. మనం తెచ్చిన సొమ్ముకు తరువాత డబ్బు ముట్టుతుంది మానవికి, ఆ మార్వాడీకి. పోలీసుల విషయం చెప్పనవసరంలేదుకదా.

సుదర్శనానికి అంతా ఆశ్చర్యంగా ఉంది. ఇలాంటి సంఘటనలు ప్రపంచంలో జరుగుతాయని అతనెప్పుడూ అనుకోలేదు. అసలు ఎరుగడు కూడాను. అసలు విచారం తాను జైల్లో పడ్డందుకు కాదు. ప్రపంచం ఇంతనీచంగా ఉందేమాఅని.

"అయితే మన్నివదిలేదెప్పటికి?" అనిఅడిగాడు సుదర్శనం.

"ఈ జరిగిన విషయమంతా మర్చిపోతామని వాగ్దానం చేసినప్పుడు. ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పమని ఒప్పుకున్నప్పుడు" అన్నారు వాళ్లు నలుగురు.

సుదర్శనం కళ్లు నవ్వుకున్నయ్.

28.8.54

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA131B117
పుస్తకం పేరు	ఎర్రభూతం
తారీఖు	30/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	97
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO.
తయారు చేసినది	Apsar
పేజీలు విడదీసినది	Thasin
స్కాన్ చేసినది	Shakshi
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good